E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

27-3-2025 గురువారం | పేజీలు–6 | హైదరాబాద్

ekaburu.com



3లో

సూరీడుతో జర జాగ్రత్త..



# ఆన్‌లైన్ బెట్టింగ్ నిరోధానికి సిట్ ఏర్పాటు

**ఆన్‌లైన్ బెట్టింగ్ అనేది అంతర్జాతీయ నేరంగా మారిందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ నేపథ్యంలోనే సిట్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.**

**ఈ కబురు (హైదరాబాద్) :**

ఆన్‌లైన్ బెట్టింగ్ అనేది అంతర్జాతీయ నేరంగా మారిందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్, రమ్మీ పట్ల కఠినంగా వ్యవహరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. వీటి నిరోధానికి, నిషేధించేందుకు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) ఏర్పాటు చేయాలనే నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. ఇలాంటి కేసుల్లో పడే శిక్షలను కూడా సవరించాల్సిన అవసరం ఉందన్నారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు.

“గుట్కా వంటి నిషేధిత పదార్థాల సరఫరా పెరిగిందని తెలుస్తోంది. ఆన్‌లైన్ బెట్టింగ్,

తరువాయి 2లో



# విద్యా రంగం రోజు రోజుకూ క్షీణించిపోతోంది

**ప్రతిస్థాయిలో విద్యా రంగం రోజు రోజుకూ క్షీణించిపోతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.**

**ఈ కబురు హైదరాబాద్:**

ప్రతిస్థాయిలో విద్యా రంగం రోజు రోజుకూ క్షీణించిపోతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శాసన మండలిలో విద్యాశాఖపై సీఎం మాట్లాడారు. “2021లో 3, 5 తరగతుల విద్యార్థులపై నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే జరిగింది. ఈ సర్వే ప్రకారం 75శాతం మంది విద్యార్థులు కనీస సామర్థ్యాలు చూపట్లేదు. తెలంగాణ ర్యాంకు చివరి నుంచి ఐదో స్థానంలో ఉంది. 3వ తరగతి విద్యార్థులకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ పరిజ్ఞానంలో తెలంగాణ 36వ స్థానంలో ఉంది. దేశంలోని మిగతా రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ అథమ స్థానంలో ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఐదో తరగతి విద్యార్థులు రెండో తరగతి పుస్తకాలు చదవలేని పరిస్థితి. ప్రతి

తరువాయి 2లో



3లో

దాడులు ఆపకుంటే.. బందీలంతా శవపేటికల్లో’..! హమాస్ హెచ్చరిక



2లో

నలుపు అంటే శక్తి



3లో

స్వయం సహాయక సంఘాలు ఉపాధి కల్పించే పారిశ్రామిక శక్తిగా ఎదిగాయి



# సీఎం ఓటుకు నోటు దొంగ అని మేము అనలేమా..?

- ఆ పార్టీ ఎమ్మెల్యేలు చెప్పిన మాటలు నేను అన్నాను..
- భట్టి అంటే గౌరవం ఉంది.. ఆది శ్రీనివాస్ అన్నీ మాట్లాడొచ్చా..
- పీసీసీ పదవినీ రూ. 50 కోట్లకు కొన్నాడని కోమటిరెడ్డ అన్నారు..
- ఇవి నా మాటలు కావు.. ఆ పార్టీ ఎమ్మెల్యేలే అన్నారు: కేటీఆర్
- ఆ పార్టీ ఎమ్మెల్యేలు చెప్పిన మాటలు నేను అన్నాను..

**ఈ కబురు (హైదరాబాద్) :**

తెలంగాణ అసెంబ్లీలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ మాట్లాడుతూ.. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అంటే గౌరవం ఉంది.. కానీ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్ని మాట్లాడొచ్చా అని ప్రశ్నించారు. ఇక, ఓటుకు నోటు దొంగ సీఎం అని అనలేదు.. జడ్చర్ల ఎమ్మెల్యే అన్నాడు 30 శాతం అని..

తరువాయి 2లో



ఇదే జరిగితే.. ఆ బైకులు, మద్యం ధరలు తగ్గుతాయి

2లో



చెలరేగిన డికాక్.. బోణీ కొట్టిన కోల్‌కతా

3లో



ధోనీ మైదానంలో కాలు మోపగానే మోతమోగింది!: అశ్విన్

# కుప్పకూలిన భవనం.. కొనసాగుతోన్న సహాయక చర్యలు



**భద్రాచలంలో నిర్మాణంలో ఉన్న ఐదు అంతస్తుల భవనం కుప్పకూలింది.**

**ఈ కబురు: భద్రాచలం:**

భద్రాచలం పట్టణంలో ఘోర ప్రమాదం జరిగింది. నిర్మాణంలో ఉన్న ఐదంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. భద్రాచలం పట్టణంలోని సూపర్ బజార్ సెంటర్‌లో ఐదంతస్తుల మేర స్లాబ్ నిర్మాణం చేపట్టి వదిలేశారు. ఈ భవనం బుధవారం మధ్యాహ్నం హఠాత్తుగా కుప్పకూలింది. ఈ ఘటనలో పలువురు మృతి చెందగా.. భవనం శిథిలాల కింద పలువురు చిక్కుకున్నట్లు తెలుస్తోంది. భవనం కూలిపోవడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

పాత భవనంపైనే మరో నాలుగు అంతస్తులు నిర్మిస్తుండగా ప్రమాదం జరిగింది. నిర్మాణంలో లోపాల వల్లే ఘటన జరిగినట్టు అధికారులు భావిస్తున్నారు. నిర్వాహకులు ట్రస్ట్ పేరుతో విరాళాలు సేకరించి భవన నిర్మాణం చేపట్టారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు, రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ఇందుకోసం ఐటీసీ నుంచి క్రేన్లు, పొక్లెయిన్లు రప్పిస్తున్నారు. కూలిన భవనం పక్కనే ఓ ఆలయం కూడా నిర్మిస్తున్నారు.

# సన్న బియ్యం ధరలు దిగొస్తున్నాయ్

- రాష్ట్రంలో సన్న బియ్యం ధరలు దిగివస్తున్నాయి. వరి సన్న రకాల సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తుండటంతో వాటి సాగు, ఉత్పత్తి భారీగా పెరిగింది.
- హోల్‌సేల్‌లో కిలోకు రూ.1015 తగ్గుదల
- రాష్ట్రంలో సన్నాల సాగు భారీగా పెరగడమే కారణం
- రూ.500 బోనస్‌తో సానుకూల ప్రభావం



**ఈ కబురు (హైదరాబాద్) :**

రాష్ట్రంలో సన్న బియ్యం ధరలు దిగివస్తున్నాయి. వరి సన్న రకాల సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తుండటంతో వాటి సాగు, ఉత్పత్తి భారీగా పెరిగింది. మార్కెట్‌లో సన్న బియ్యం సమృద్ధిగా దొరుకుతుండటంతో ధరలు గణనీయంగా తగ్గుతున్నాయి. ఒక్క తెలంగాణలోనే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోనూ దీని ప్రభావం పడిందని బియ్యం ఎగుమతిదారులు చెబుతున్నారు. బోనస్‌కు ముందు రాష్ట్రంలో ప్రీమియం రకం సన్న బియ్యం ధరలు కిలోకు రూ.6070 వరకు ఉండేవి. ప్రస్తుతం రూ.5055కు లభిస్తున్నాయి. ఫైన్ రకం రూ.5560 ఉండేవి. ఇప్పుడు రూ.43 48కు దొరుకుతున్నాయి. ఇవి హోల్ సేల్ మార్కెట్ ధరలు. రకాన్ని బట్టి గతంలో కంటే కిలోకు రూ.10 15 వరకు తగ్గాయి. రిటైలర్లు మాత్రం కిలోకు రూ.58 వరకే తగ్గిస్తున్నారు.

**బోనస్‌తో కలిపి రూ.2,820కి కొనుగోలు**

ధాన్యానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ‘ఏ’ గ్రేడ్‌కు రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300. తెలంగాణ ప్రభుత్వం సన్న ధాన్యానికి రూ.500 బోనస్ కలిపి రూ.2,820కి రైతుల నుంచి కొనుగోలు చేసింది. 2024 ఖరీఫ్ (వానాకాలం) సీజన్ నుంచి దీన్ని అమలు చేస్తోంది. బోనస్ ప్రకటనతో రాష్ట్రంలో సన్నాల సాగు 2023 ఖరీఫ్‌తో పోలిస్తే 2024 ఖరీఫ్‌లో 50 శాతానికిపైగా


2లో

# సభలో నన్ను మాట్లాడనివ్వట్లేదు: రాహుల్ గాంధీ విమర్శలు!

**లోక్‌సభలో తనను మాట్లాడేందుకు అనుమతించడంలేదని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.**

**ఈ కబురు (ఢిల్లీ):**

లోక్‌సభలో తనను మాట్లాడేందుకు అనుమతించడంలేదని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు మాత్రం ఇది సరైన మార్గం కాదన్నారు. ఏం జరుగుతోందో తనకు తెలియడంలేదని.. మాట్లాడేందుకు అనుమతి కోరినా ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకుడికి సభలో ప్రసంగించే



అవకాశం ఇవ్వడం సంప్రదాయమని గుర్తు చేశారు. బుధవారం లోక్‌సభ వాయిదా అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

‘‘నేను ఎప్పుడు లేచి నిలబడినా మాట్లాడేందుకు అనుమతించడం లేదు. మేం చెప్పాలనుకొనే అంశాలను లేవనెత్తేందుకు మాకు అనుమతి ఇవ్వడంలేదు. నేనేమీ చేయలేదు. ఒక్కమాట కూడా మాట్లాడకుండా కూర్చున్నా. ఏడెనిమిది రోజుల నుంచి నన్ను మాట్లాడేందుకు అనుమతించట్లేదు. ఇదో కొత్త ఎత్తుగడ. ప్రతిపక్షానికి

2లో

ఈ-కబురు
27-3-2025
గురువారం
e kaburu.com

# విద్యా రంగం రోజు రోజుకూ క్షీణించిపోతోంది

మొదటి పేజి తరువాయి

స్థాయిలో విద్యారంగం రోజు రోజుకూ క్షీణించిపోతోంది.

**ప్రభుత్వమే కాదు.. సమాజం కూడా బాధ్యత తీసుకోవాలి**

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 11వేలకు పైగా టీచర్ల నియామకం చేపట్టాం. 21వేల మందికి పైగా టీచర్లకు పదోన్నతులు కల్పించాం. ఏడెనిమిదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న 36వేల మంది టీచర్ల బదిలీ చేపట్టాం. కలెక్టర్లనైనా బదిలీ చేయవచ్చు గానీ, టీచర్ల బదిలీ ఆషామాషీ కాదు. 36వేల మంది టీచర్లను చిన్న ఆరోపణలు లేకుండా బదిలీ చేశాం. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులపై రూ.1.08లక్షలు చొప్పున ఖర్చు చేస్తున్నాం. ప్రైవేటులో రూ.50వేల వరకు ఖర్చయితే.. ప్రభుత్వ పాఠశాలల్లో రూ.లక్ష ఖర్చవుతోంది. బడ్జెట్‌లో విద్యకు ప్రాధాన్యమిస్తూ రూ.23,108 కోట్లు కేటాయించాం. విద్యా రంగానికి భారీగా నిధులు కేటాయించినా ప్రమాణాలు పడిపోతున్నాయి. ఇందుకు ప్రభుత్వమే కాదు.. సమాజం బాధ్యత తీసుకోవాలి. లోతుగా విశ్లేషించి సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. రాజకీయ కోణంలో ఆలోచన చేసినంత కాలం విద్యారంగం ప్రక్షాళన కాదు. విద్య పట్ల ప్రత్యేక విధానం తీసుకురావాలనేది ప్రభుత్వ ఉద్దేశం. విద్యారంగం బలోపేతానికి సూచనల కోసం విద్యా కమిషన్ ఏర్పాటుచేశాం.



**ప్రభుత్వ పాఠశాలల్లో చదివేవారిని ప్రోత్సహించాలి..**

ఏటా లక్షకు పైగా ఇంజినీరింగ్ విద్యార్థులు బయటకు వస్తున్నారు. రూ.15వేలకు కూడా ఇంజినీరింగ్ విద్యార్థులు పనిచేసే పరిస్థితి. నైపుణ్యం ఉన్న యువత దొరకట్లేదని కంపెనీలు చెబుతున్నాయి. తెలంగాణ అభివృద్ధి సాధించిందని ఒడిశా, బిహార్ నుంచి రావట్లేదు. మన వద్ద ఉన్న విద్యార్థులకు నైపుణ్యం లేక



రోడ్లపై తిరుగుతున్నారు. మన నిర్లక్ష్యంతో సమాజ నైపుణ్యాల మేరకు విద్యార్థులను అప్‌గ్రేడ్ చేయలేదు. నైపుణ్యాల పెంపునకు యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం. యంగ్ ఇండియా పత్రిక ద్వారా గాంధీ స్వాతంత్ర్య ఉద్యమం నడిపారు. గాంధీ స్ఫూర్తితో తెలంగాణలో విద్యా ప్రమాణాల మెరుకు చర్యలు తీసుకుంటాం. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తేనే స్థానిక సంస్థల్లో పోటీకి, ప్రభుత్వ ఉద్యోగం పొందేందుకు అవకాశంపై చర్చించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివేవారిని ప్రోత్సహించేలా చర్యలు ఉండాలి'' సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.



# సీఎం ఓటుకు నోటు దొంగ అని మేము అనలేమా..?

మొదటి పేజి తరువాయి

అలాగే, పీసీసీ పదవిని 50 కోట్ల రూపాయలకు కొన్నాడు అని కోమటిరెడ్డి అన్నారు.. ఇవన్నీ నేను అన్న మాటలు కావు.. ఆ పార్టీ ఎమ్మెల్యేలు చెప్పిన మాటలే చెప్తున్నాను అని కేటీఆర్ పేర్కొన్నారు శాసనసభలో అధికార పక్షంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ నిప్పులు చెరిగారు. కేటీఆర్‌ను ఉద్దేశించిన డిప్యూటీ సీఎం చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్‌తో పాటు హరీశ్‌రావు మిగతా సభ్యులు మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, అమలు చేస్తామన్న సంక్షేమ పథకాలపై నిలదీసే హక్కు ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీకి ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. మేం సభను ప్రోవోక్ చేయాలనుకుంటే చేయొచ్చు.. 30 శాతం కమీషన్ అని కాంగ్రెస్ ఎమ్మెల్యేలే అంటున్నారు. 20 శాతం కమీషన్ అని సచివాలయంలో ధర్నాలు చేస్తున్నారు అని కేటీఆర్ అన్నారు. కేటీఆర్ వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందిస్తూ.. ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై కేటీఆర్‌తో పాటు హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ సభ్యులు డిమాండ్ చేశారు. అనంతరం కేటీఆర్‌కు మాట్లాడేందుకు స్పీకర్ అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 2009 నుంచి కలిసి పని చేస్తున్నాం. ఆయన డిప్యూటీ స్పీకర్‌గా ఉన్నప్పుడు నేను తొలిసారి ఎమ్మెల్యేగా వచ్చాను. ఆయనతో మాకు ఫ్రెండ్‌షిప్ ఉంది. గత 16 ఏండ్ల నుంచి ఆయనతో కలిసి పని చేస్తున్నాం. భట్టి గారంటే గౌరవం ఉంది. పెద్దన్నలాగా గౌరవిస్తాం. ఆది శ్రీనివాస్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం అని కేటీఆర్ పేర్కొన్నారు. ఓటుకు నోటు దొంగ రేవంత్ రెడ్డి అని మేము అనలేమా? అని కేటీఆర్ ప్రశ్నించారు. 30 శాతం కమీషన్లు తీసుకుంటున్నారని జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అన్నారు. దాని మీద చర్య తీసుకోండి అని రెవెన్యూ మినిస్టర్‌ను కోరాను. 20 శాతం కమీషన్లు తీసుకుంటున్నారని కాంట్రాక్టర్లు సచివాలయంలో ధర్నా చేశారు. దాని మీద చర్య తీసుకోమని అడిగాను. రేవంత్ రెడ్డి రూ.50 కోట్లు ఇచ్చి పీసీసీ అధ్యక్ష పదవి కొనుకున్నాడని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్న మాటలు మేము అనలేమా? అని కేటీఆర్ ప్రశ్నించారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్ నిరోధానికి సిట్ ఏర్పాటు

మొదటి పేజి తరువాయి

రమ్మీ ప్రచారం కల్పించినవారిని విచారించాం. ప్రచారం కల్పించినవారిని విచారించడంతోనే ఈ సమస్యకు పరిష్కారం లభించినట్లు కాదు. సిట్ ఏర్పాటు చేసి వీటికి అడ్డకట్ట వేయాలని నిర్ణయించాం. ఆన్‌లైన్ బెట్టింగ్, నేరాల్లో ఏ రకంగా భాగస్వామ్యం ఉన్నా చర్యలు తప్పవు'' అని సీఎం రేవంత్ హెచ్చరించారు.




**శాంతిభద్రతల విషయంలో ఎక్కడైనా రాజీపడ్డామా?**

''శాంతిభద్రతల విషయంలోనూ కొందరు విమర్శలు చేస్తున్నారు. గత ప్రభుత్వం శాంతిభద్రతల విషయంలో ఎంత ఉదాసీనంగా ఉందో అందరికీ తెలుసు. దిశ ఘటన, న్యాయవాద దంపతుల హత్య వంటివి గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఉదాహరణలు. న్యాయవాద దంపతులను నడిరోడ్డుపై చంపేస్తే ఇప్పటికీ చర్యల్లేవు. సింగరేణి కాలనీలో ఆరేళ్ల బాలిక హత్యాచార ఉదంతంలో ఆనాడు చర్యలు తీసుకోలేదు. మహిళలపై దాడుల విషయంలో గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం నాలుగో స్థానంలో ఉంది. జూబ్లీహిల్స్ పబ్ కేసులో భారాస నాయకుడి కుమారుడే ఉన్నా పట్టించుకోలేదు. ఒక మంత్రి కుమారుడి ప్రమేయం ఉందని అప్పట్లో వార్తలొచ్చాయి. శాంతిభద్రతల విషయంలో దుష్ప్రచారం చేయడం ద్వారా రాష్ట్రానికి రావాల్సిన పెట్టుబడులను అడ్డుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రం కుప్పకూలిపోయిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రం దివాలా తీస్తే భారాస నేతలు సంతోషపడతారా? అధికార కాంక్షతో ఎలాంటి అసత్య ప్రచారమైనా చేస్తారా? ఈ 15 నెలల పాలనలో శాంతిభద్రతల విషయంలో ఎక్కడైనా రాజీపడ్డామా?'' అని సీఎం ప్రశ్నించారు.

**ఆ ఇద్దరి పోటీతో మాకు తలనొప్పి వస్తోంది**

''ధరల నియంత్రణలో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్‌గా ఉంది. 85 శాతం సొంత పన్నుల వసూళ్లతో రాష్ట్రం అగ్రస్థానంలో ఉంది. కడుపునిండా విషం పెట్టుకొని ఎందుకు మాట్లాడుతారు? గతంలో జానారెడ్డి.. విపక్ష నేతగా ప్రభుత్వానికి సహకరించారు. జానారెడ్డి నెలకొల్పిన సంప్రదాయాన్ని ఎందుకని కొనసాగించరు? ఎన్నికలు ఎప్పుడో 2029లో వస్తాయి.. మీరు కోరుకున్నంత మాత్రాన ఇప్పుడే రావు. భారాస ముఖ్యనేతలు ఇద్దరు పోటీపడి మరీ దుష్ప్రచారం చేస్తున్నారు. ఆ ఇద్దరి పోటీతో మాకు తలనొప్పి వస్తోంది.

నేను పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యేలకు అందుబాటులో ఉంటాను. గజ్వేల్ ఎమ్మెల్యే నా దగ్గరకు వచ్చినా మనస్ఫూర్తిగా సహకరిస్తాను. పద్మారావు వచ్చారు.. కొన్ని నియోజకవర్గ పనులు అడిగారు. అక్కడికక్కడే ఇచ్చేశా. విపక్ష ఎమ్మెల్యేలు వచ్చినా పనులు చేసి పెడుతున్నాను'' అని సీఎం పేర్కొన్నారు.



# ఇదే జరిగితే.. ఆ బైకులు మద్యం ధరలు తగ్గుతాయి

**ఈ కబురు:** సుంకాల విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్న అమెరికా.. భారత్ మీద ఆ ప్రభావాన్ని కొంత తగ్గిస్తోంది. ఇందులో భాగంగానే హార్లే డేవిడ్సన్ మోటార్ సైకిళ్ళు, బోర్బన్ విస్కీ అండ్ కాలిఫోర్నియా వైన్స్ మీద దిగుమతి సుంకాలను తగ్గించాలని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ప్రస్తుతం రెండు దేశాలు కొన్ని ఉత్పత్తులపై సుంకాలను మరింత తగ్గించి.. వాణిజ్య సంబంధాలను పెంచుకునే దిశగా చర్చలు జరుపుతున్నాయి.

ప్రభుత్వం గతంలో హార్లే డేవిడ్సన్ మోటార్ సైకిళ్లపై దిగుమతి సుంకాలను 50 శాతం నుంచి 40 శాతానికి తగ్గించింది. ఇప్పుడు దీనిని మరింత తగ్గించడానికి చర్చలు జరుగుతున్నాయి. ఇదే జరిగితే.. ఈ ప్రీమియం బైకులోను దేశంలో సరసమైన బైకుల జాబితాలోకి చేరుతాయి.

బోర్బన్ విస్కీపై దిగుమతి సుంకాన్ని గతంలో 150 శాతం నుంచి 100 శాతానికి తగ్గించారు. రెండు దేశాల మధ్య సజావుగా వాణిజ్యాన్ని ప్రోత్సహించడానికి అధికారులు ఇప్పుడు మరి కొంత ట్యాక్స్ తగ్గించనున్నారు. ఈ వాణిజ్య చర్చలు మోటార్ సైకిళ్ళు, ఆల్కహాలిక్ పానీయాలకే పరిమితం కాలేదు. ఎందుకంటే ఇందులో ఔషధ ఉత్పత్తులు, రసాయనాల ఎగుమతుల విస్తరణలు కూడా ఉన్నాయి. వీటి గురించి కూడా అధికారులు చర్చిస్తున్నారు.

భారతదేశంలో అభివృద్ధి చెందుతున్న ఔషధ రంగంలో తన మార్కెట్ వాటాను పెంచుకోవాలని అమెరికా ఆసక్తిగా ఎదురు చూస్తోంది. అయితే భారతదేశం అమెరికాకు తన ఎగుమతులకు అనుకూలమైన నిబంధనలను పొందాలని చూస్తోంది.



# నలుపు అంటే శక్తి

**ఈ కబురు** :నాలుగు సంవత్సరాల అమ్మాయి తన తల్లిని 'అమ్మా... నన్ను తిరిగి నీ గర్భంలోకి తీసుకొని తెల్లగా పుట్టించగలవా?' అని అడిగింది. తల్లి ఆశ్చర్యంగా చూసి 'ఎందుకమ్మా?' అని అడిగింది. 'నల్లపిల్ల అంటూ నన్ను అందరూ వెక్కిరిస్తున్నారు' కళ్లనీళ్లతో చెప్పింది ఆ అమ్మాయి. 'రంగుది ఏముందమ్మా! నువ్వు చదువుకొని పెద్ద స్థాయిలో ఉంటే రంగు గురించి ఎవరూ మాట్లాడరు' అన్నది ఆ తల్లి ఓదార్పుగా. కట్ చేస్తే.... ఆ అమ్మాయి కేరళ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిలాంటి పెద్ద పదవిలోకి వచ్చింది. అయినా నల్లటి ఆమె ఒంటి రంగును హేళన చేస్తూ అయిదు దశాబ్దాలుగా ఆమెను బాధిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో తన ఆవేదనకు అక్షర రూపం ఇచ్చి ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు కేరళ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శారదా మురళీధరన్. 'నలుపు' అనే ముద్ర వేసి వెక్కిరించడంపై శారదా మురళీధరన్ గొంతు విప్పారు. 'ఇది విశ్వం యొక్క సర్వవ్యాప్త సత్యం అయినప్పుడు ఆ రంగును ఎందుకు కించపరుస్తున్నారు?' అంటూ ప్రశ్నించారు. వర్ణ, లింగ వివక్షకు సంబంధించిన కామెంట్స్‌పై ఫేస్‌బుక్‌లో ఆమె పెట్టిన పోస్ట్ సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది. శారదకు ఎంతోమంది నుంచి మద్దతు వెల్లువెత్తింది.' నల్లరంగు కారణంగా నేను ఇతరుల కంటే తక్కువ అనే భావన నాలో ఉండేది. నా పిల్లలు మాత్రం నలుపు అంటే అందం అంటారు. నల్లజాతి వారసత్వాన్ని కీర్తించారు. నేను గమనించని చోట అందాన్ని వెదుక్కుంటూ వచ్చారు. వారి మాటలు నలుపు వర్ణం విలువను, అందాన్ని గుర్తించేలా చేసింది' అంటారు శారద.

శారద 1990 బ్యాచ్ ఐఏఎస్ ఆఫీసర్. ఆరేళ్ల పాటు ప్రతిష్ఠాత్మకమైన 'కుటుంబ శ్రీ'కి నేతృత్వం వహించారు. ఆ తర్వాత జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్‌లో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా పనిచేశారు. పంచాయితీ రాజ్ మంత్రిత్వ శాఖలో సంయుక్త కార్యదర్శిగా, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్) డైరెక్టర్ జనరల్‌గా పనిచేశారు. త్రివేండ్రం జిల్లా కలెక్టర్‌గా, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కమిషనర్‌గా... ఇలా ఎన్నో ఉన్నత పదవులు నిర్వహించారు. గత సంవత్సరం భర్త డాక్టర్ వేణు నుంచి కేరళ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. అయినా సరే... 'నలుపు' పేరుతో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వెక్కిరింపులు ఎదురవుతూనే ఉన్నాయి. కేరళ చీఫ్ సెక్రటరీగా తన భర్త నుంచి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన రంగుతో పోల్చుతూ, ఆ పదవికి మీరేం సరిపోతారు? అన్నట్లుగా కొందరు కామెంట్స్ చేశారు. వారి కామెంట్స్‌లో నలుపు రంగును తక్కువ చేసి వెక్కిరించడం ఉంది. ఆడవాళ్లకు పెద్ద పదవులు ఎందుకు? అనే పురుషాధిపత్య భావజాలం ఉంది. ఈ నేపథ్యంలోనే తన మనసులోని ఆవేదనను ఫేస్‌బుక్ పోస్ట్‌లో పెట్టారు శారద. ఆ పోస్ట్‌పై మొదట్లో కొందరి కామెంట్స్ చూసిన తరువాత ఆ పోస్ట్‌ను డిలీట్ చేశారు. 'మీ పోస్ట్ నేపథ్యంలో చర్చించాల్సిన విషయాలు చాలా ఉన్నాయి' అని శ్రేయోభిలాషులు చెప్పడంతో మరోసారి పోస్ట్ చేశారు. రీ-షేర్ చేసిన తరువాత ఆమె పోస్ట్‌కు మద్దతుగా ఎన్నో కామెంట్స్ వచ్చాయి. శారద ధైర్యసాహసాలకు సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఆమెను ప్రశంసించిన వారిలో కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత సతీశన్ కూడా ఉన్నారు.


# సన్న బియ్యం ధరలు దిగొస్తున్నాయ్

మొదటి పేజి తరువాయి

పెరిగింది. ఆ మేరకు దిగుబడీ వృద్ధి చెందింది. 202324 ఖరీఫ్‌లో మొత్తం 144.80 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. 2024 25లో మొత్తం ధాన్యం దిగుబడి 145.56 లక్షల టన్నులు. ఇందులో సన్న ధాన్యం 88.39 లక్షల టన్నులు కాగా, దొడ్డు ధాన్యం 57.17 లక్షల టన్నులు. దిగుబడి ఎక్కువ వచ్చిన ఫలితంగా మార్కెట్లోకి సన్న బియ్యమూ భారీగా పెరిగి ధరలు తగ్గుతున్నాయి. ప్రతి సీజన్‌లో తెలంగాణ నుంచి పొరుగు రాష్ట్రాల మిల్లర్లు, వ్యాపారులు పెద్దమొత్తంలో సన్న ధాన్యం కొనుగోలు చేస్తుంటారు. సన్నాల సరఫరా పెరగడంతో ఆ రాష్ట్రాల్లోనూ ధరలు తగ్గాయని రైస్‌మిల్లర్లు చెబుతున్నారు. ధరలు తగ్గడానికి ఇతర కారణాలు కూడా కొంత ప్రభావం చూపుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఉత్తర్‌ప్రదేశ్, ఒడిశా, బిహార్ వంటి రాష్ట్రాల నుంచీ రాష్ట్రానికి సన్న బియ్యం వస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం 'భారత్ బ్రాండ్' పేరుతో సబ్సిడీ బియ్యం విక్రయాల్ని కొద్ది నెలల క్రితం ప్రారంభించడం కూడా కొంత ప్రభావం చూపుతోందని అంటున్నారు.

**ఉగాది తర్వాత మరింత తగ్గే అవకాశం**

రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో సన్నబియ్యం ధరలు మరింత తగ్గే అవకాశాలున్నాయి. 'బియ్యం మార్కెట్ ప్రస్తుతం స్తబ్ధుగా ఉంది. అమ్మకాలు తగ్గాయి. రేషన్ కార్డులున్న పేద, మధ్యతరగతి రైతులు సన్న బియ్యం కొనడం లేదు. ప్రభుత్వం పంపిణీ చేసే సన్న బియ్యం కోసం ఎదురుచూస్తున్నారు' అని తెలంగాణ రా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు



గణపతిరెడ్డి తెలిపారు.

**బోనస్ ఇవ్వడంతోనే..-బీవీ కృష్ణారావు, బియ్యం ఎగుమతిదారుల సంఘం జాతీయ అధ్యక్షుడు**

సన్న ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వడంతో రాష్ట్రంలో ఉత్పత్తితో పాటు మార్కెట్లోకి వచ్చే సన్న బియ్యం పరిమాణం పెరిగింది. ఫలితంగా ధరలు తగ్గాయి. ఆర్ఎన్ఆర్, హెచ్ఎంటీ రకాలను రైస్ మిల్లుల్లో (హోల్‌సేల్) కిలో రూ.45కు అమ్ముతున్నారు. బోనస్‌కు ముందున్న పరిస్థితితో పోలిస్తే కిలోకు దాదాపు రూ.15 తగ్గింది. రిటైలర్లు ధరల్ని కొద్దిగానే తగ్గిస్తున్నారు. పూర్తిస్థాయిలో తగ్గించడానికి కొంత సమయం పట్టొచ్చు. దొడ్డు బియ్యం ధరలు కూడా గతంతో పోలిస్తే తగ్గాయి. కానీ అది 10 శాతం మాత్రమే

# సభలో నన్ను మాట్లాడ నివ్వట్లేదు

మొదటి పేజి తరువాయి

ఇక్కడ చోటులేదు. ఇటీవల ప్రధాని కుంభమేళా గురించి మాట్లాడినప్పుడు నేను నిరుద్యోగం గురించి మాట్లాడాలనుకున్నా.. కానీ మాట్లాడేందుకు అనుమతించలేదు. మమ్మల్ని మాట్లాడేందుకు అనుమతించకపోవడం అప్రజాస్వామికం'' అని రాహుల్ అన్నారు.

**రాహుల్ వల్ల భాజపాకు మేలే: యోగి ఆదిత్యనాథ్**


మరోవైపు, బుధవారం సభా కార్యకలాపాల సమయంలో స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ.. సభా గౌరవాన్ని కాపాడేందుకు నిబంధనలు పాటించాలని సూచించారు. సభలోని సభ్యులు హుందాగా వ్యవహరించాలన్నారు. సభ్యుల ప్రవర్తన ఈ సభ ఉన్నత ప్రమాణాలకు అనుగుణంగా లేదని అనేక సందర్భాల్లో తన దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ఈ సభలో తండ్రీ కూతురు, తల్లీ కుమార్తె, భార్యా భర్తలను సభ్యులుగా ఉన్నారు. ఇలాంటి సందర్భంలో ప్రతిపక్ష నేత 349 రూల్ (సభలో సభ్యులు పాటించాల్సిన ప్రవర్తనా నియమావళిని సూచించే నిబంధన) ప్రకారం నడుచుకుంటారని తాను ఆశించినట్లు తెలిపారు.

# ఈత కోసం చెరువులో దిగి బాలుడు మృతి



కార్తీక్ (ఫైల్ )

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**
గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న మిస్సింగ్ కేసు విషాదంగా ముగిసింది. మంగళవారం కనిపించకుండా పోయిన బాలుడు ఈత కోసం చెరువులోకి దిగి నీళ్లలో మునిగి మృతి చెందినట్లు గుర్తించారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం...కామారెడ్డి జిల్లా డోంగ్లీ మండలం కుర్లీ గ్రామానికి చెందిన బి. మల్లయ్య, బాలమణిలు బ్రతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చి నానక్ రాంగూడలో నివాసం ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాగా వీరికి ఓ కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు కార్తీక్(14) నానక్ రాంగూడ ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. ఈనెల 24వ తేదీన ఉదయం మల్లయ్య, బాలమణిలు పని నిమిత్తం బయటకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చారు. ఇంట్లో కార్తీక్ కనిపించకపోడంతో తెలిసిన వారివద్ద, చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో మంగళవారం ఉదయం గచ్చిబౌలి పోలీసులకు పిర్యాదు చేయగా, పోలీసులు మిస్సింగ్ చేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు. కాగా బుధవారం ఉదయం ఐటి కారిడార్ పరిధిలోని విప్రో చెరువులో గుర్తు తెలియని బాలుడి మృతదేహాన్ని గుర్తించిన వెంకటయ్య అనే వ్యక్తి పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు కార్తీక్ కుటుంబ సభ్యులను రప్పించగా, మృతదేహం కార్తిక్ దేనని గుర్తించారు. చెరువు కట్ట మీద బట్టలు ఉండడంతో ఈత కోసం చెరువులోపలికి దిగిన కార్తీక్ నీళ్లలో మునిగి మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. బాలుడు ఒక్కడే చెరువు వద్దకు వచ్చాడా లేక వెంట ఇంకా ఎవరైనా ఉన్నారా అనే విషయాలు తెలియరాలేరు. ఈమేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.




# సూరీడుతో జర జాగ్రత్త..

**తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం తొమ్మిది దాటితే చాలు.. ఎండవేడిమికి బయటకు వెళ్లలేని పరిస్థితి ఉంది. రెండు రాష్ట్రాల్లో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలతో జనం అల్లాడుతున్నారు. ఒకవైపు ఎండవేడిమి, మరోవైపు ఉక్కపోతతో చుక్కలు చూస్తున్నారు. ఈ క్రమంలోనే.. ద్రోణి ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో చెదురుమదురు వర్షా లు కురిశాయి.. దీంతో కాస్త ఉపశమనం కలిగినట్లయింది.. భిన్న వాతావరణ పరిస్థితుల మధ్య.. వాతావరణ శాఖ కీలక ప్రకటన జారీ చేసింది. ఇవ్వాల్టి నుంచి భానుడు మరింత ప్రతాపం చూపిస్తాడని పేర్కొంది..**

**తెలంగాణలో వాతావరణం ఇలా..**
దక్షిణ ఛత్తీస్ ఘడ్ నుండి మధ్య మహారాష్ట్ర, ఉత్తర కర్ణాటక మీదుగా ఉత్తర తమిళనాడు వరకు సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ రోజు నుంచి క్రమేపి రెండు నుండి మూడు డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. తెలంగాణలోని అన్ని జిల్లాలలో వడగాలులు తీవ్రత పెరిగే అవకాశం ఉందని తెలిపింది. బుధవారం గరిష్టంగా అదిలాబాద్‌లో 39.3 కనిష్టంగా నల్లగొండలో 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది.

నిన్న తెలంగాణలోని ఆదిలాబాద్, నిజామాబాద్, భద్రాచలం, ఖమ్మం, మహబూబ్ నగర్, లలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదయ్యాయి.. ఆదిలాబాద్..38.3, భద్రాచలం..38, నిజామాబాద్..37.3, ఖమ్మం..36.6, మహబూబ్ నగర్..35.5, నల్లగొండ..36, రామగుండం..35.6, మెదక్..35.4, హనుమకొండ..35, హైదరాబాద్..33.8 డిగ్రీల పగలు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి..

**ఏపీలో తారెత్తిస్తున్న ఎండలు..**
ఏపీలో ఎండలు తారెత్తిస్తున్నాయి.. నేడు 108 మండలాల్లో తీవ్రవాడగాలులు వీచే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. బుధవారం శ్రీకాకుళం జిల్లా 15, విజయనగరం జిల్లా 21, పార్వతీపురంమన్యం జిల్లా 10, అల్లూరి సీతారామరాజు జిల్లా 8, అనకాపల్లి 7, కాకినాడ 7, కోనసీమ 3, తూర్పు గోదావరి 13, ఏలూరు 5, కృష్ణా 2 ఎన్టీఆర్ 6, గుంటూరు 3, పల్నాడు 8 మండలాల్లో వడగాల్పులు (108) ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది.. గురువారం 33 మండలాల్లో తీవ్రవడగాల్పులు..206 మండలాల్లో వడగాల్పులు వీచేందుకు అవకాశం ఉందని పేర్కొంది.

కాగా.. మంగళవారం నంద్యాల జిల్లా రుద్రవరంలో 41.6□C, ప్రకాశం జిల్లా దరిమడుగులో 41.1□C, నెల్లూరు జిల్లా సోమశిలలో 40.9□C, అన్నమయ్య జిల్లా పూతనవారిపల్లి, చిత్తూరు జిల్లా పిపల్లి, వైఎస్సార్ జిల్లా అట్లూరులో 40.1□C, తిరుపతి జిల్లా రేణిగుంటలో 40□C చొప్పున అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.. అలాగే 15 మండలాల్లో వడగాల్పులు వీచాయి.
ఎండల తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా బయటకు వచ్చే వారు జాగ్రత్తలు పాటించాలని సూచనలు చేసింది వాతావరణ శాఖ..

## స్వయం సహాయక సంఘాలు ఉపాధి కల్పించే

# పారిశ్రామిక శక్తిగా ఎదిగాయి

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**
తెలంగాణ రాష్ట్రంలో మహిళా స్వయం సహాయక సంఘాలు స్వయం ఉపాధి కల్పించుకోవడానికే పరిమితం కాకుండా పదిమందికి ఉపాధి కల్పించే పారిశ్రామిక శక్తిగా ఎదిగాయని తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖమంత్రి డి. సీతక్క అన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కి) లో బుధవారం నిర్వహించిన స్త్రీ నిధి 12వ సర్వసభ్య సమావేశానికి మంత్రి సీతక్క ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ స్త్రీల శక్తి, ఆర్థిక స్వావలంభనకు నిదర్శనంగా స్త్రీ నిధి నిలుస్తుందన్నారు. వడ్డీ వ్యాపారుల అణిచివేత నుంచి మహిళలను రక్షించేందుకు 2011లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్త్రీ నిధి సహకార సంస్థ నేడు 5200 కోట్ల మూలనిధి, 800 కోట్ల సేవింగ్స్ తో మహిళల ఆర్థిక సమర్థతకు నిలయంగా మారిందన్నారు. స్త్రీ నిధి తోడ్పాటుతో మహిళలు స్వయం ఉపాధి కల్పించుకోవడంతో పాటు ఇతరులకు ఉపాధి కల్పించే విధంగా ఎదగడం అభినందనీయమన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక విజన్ తో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. దివ్య దేవరాజన్ ను ప్రత్యేక అధికారిగా నియమించడంతో పాటు ఆర్టీసి బస్సు యాజమాన్యం నుంచి సోలార్ ప్లాంట్ల నిర్వహణ వరకు విస్తృత అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం మహిళలకు 3500కోట్ల వడ్డీని ఎగ్గొట్టగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంఘాలకు వడ్డీలను చెల్లిస్తూ, 23 వేల కోట్ల బ్యాంకు రుణాలను ఇప్పించిందన్నారు. రాజీవ్ యువ వికాసం ద్వారా 4,600 కోట్ల సబ్సిడీ రుణాలను, ఇళ్ల కోసం 50వేల నుంచి 2లక్షల రూపాయల వరకు రాయితీలను తమ ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. మహిళా శక్తిని మరింత బలోపేతం చేసేందుకు నగరంలోని హిమాయత్ నగర్ లో ఉన్న పంచాయతీరాజ్ కమీషనర్ కార్యాలయాన్ని స్త్రీనిధి అవసరాలను అందజేస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం తెలంగాణలో ఉంది మహిళా సంఘాలు కాదని, మహిళా సైన్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనిధి ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.




సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి సీతక్క

## దాడులు ఆపకుంటే.. బందీలంతా శవపేటికల్లో'..!

# హమాస్ హెచ్చరిక

**బందీలను సురక్షితంగా ఉంచేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని.. కానీ, ఇజ్రాయెల్ దాడులు వారి ప్రాణాలను ప్రమాదంలో పడేస్తున్నాయని హమాస్ తెలిపింది.**

**ఈ కబురు:** ఇజ్రాయెల్ తన దాడులను పునః ప్రారంభించడంతో.. గాజా మళ్లీ నెత్తురోడుతోంది. భీకర దాడుల్లో ఇప్పటికే వందలాదిమంది ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రమంలోనే ఇజ్రాయెల్‌కు హమాస్ తీవ్ర హెచ్చరికలు చేసింది. దాడులను ఇలాగే కొనసాగిస్తే, సైన్యం సాయంతో బందీల ను తరలించేందుకు యత్నిస్తే.. వారు శవపేటికల్లో తిరిగొస్తారని తెలిపింది. మరోవైపు.. గాజా సిటీలోని కొన్ని ప్రాంతాలను ఖాళీ చేయాలంటూ స్థానికులకు ఐడీఎఫ్ తాజాగా ఆదేశాలు జారీ చేసింది.

''బందీలను సజీవంగా ఉంచేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం. కానీ, ఇజ్రాయెల్ చేపడుతున్న దాడులు వారి ప్రాణాలను ప్రమాదంలో పడేస్తున్నాయి. సైన్యం సాయంతో బందీలను విడిపించుకోవాలని ప్రయత్నిస్తే.. వారు శవపేటికల్లో తిరిగివస్తారు'' అని హమాస్ ఓ ప్రకటనలో తెలిపింది. మరోవైపు.. గాజాపై టెల్‌అవీవ్ తన దాడులను విస్తృతం చేస్తోంది. గాజా సిటీలోని జీటౌన్, టెల్ అల్‌హవా తదితర ప్రాంతాల పౌరులు తమ నివాసాలను ఖాళీ చేయాలని ఆదేశించింది. ఈ ప్రాంతాల నుంచి ఉగ్రమూకలు చేపట్టిన రాకెట్ దాడులకు త్వరలో సమాధానం చెబుతామని తెలిపింది.



**గాజాలో హమాస్‌కు వ్యతిరేకంగా నిరసనలు**

మిగతా 59 మంది బందీలను అప్పగించేవరకు హమాస్‌పై సైనికపరంగా ఒత్తిడి పెంచుతామని నెతన్యాహు ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. అయితే, శాశ్వత కాల్పుల విరమణ ఒప్పందం కుదిరేవరకు, గాజా నుంచి ఇజ్రాయెల్ పూర్తిగా వైదొలిగేవరకు బందీలను విడుదల చేయబోమని హమాస్ చెబుతోంది. ఇటీవల ఇజ్రాయెల్ మరోసారి ప్రారంభించిన దాడుల్లో.. ఇప్పటివరకు దాదాపు 830 మంది మృతి చెందారు. ఈ పరిణామాల నడుమే హమాస్‌కు వ్యతిరేకంగా స్థానికంగా ఆందోళనలు వెల్లువెత్తడం గమనార్హం.

# కమలం పార్టీతో పొత్తుపై తేల్చిచెప్పిన పళనిస్వామి

**కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను పళనిస్వామి, ఆ పార్టీ సీనియర్ నేతలు న్యూఢిల్లీలో మంగళవారంనాడు కలుసుకున్నారు. దీంతో పొత్తు ఊహాగానాలు ఊపందుకున్నాయి. అయితే తమ సమావేశం వివరాలపై ఆయన క్లుప్తంగా మాట్లాడుతూ, ప్రజలకు సంబంధించిన అంశాలపైనే తాము మాట్లాడామని చెప్పారు.**

**ఈ కబురు (చెన్నై) :**
వచ్చే ఏడాది జరిగే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకేబీజేపీ మళ్లీ పొత్తుపెట్టుకోనున్నాయనే ఉహాగానాలపై అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె.పళనిస్వామి బుధవారం నాడు స్పందించారు. అవునని కానీ కాదని కానీ నేరుగా చెప్పకుండానే ఎన్నికల అవగాహనకు తాము వ్యతిరేకం కాదనే సంకేతాలు ఇచ్చారు.

కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను పళనిస్వామి, ఆ పార్టీ సీనియర్ నేతలు న్యూఢిల్లీలో మంగళవారంనాడు కలుసుకున్నారు. దీంతో పొత్తు ఊహాగానాలు ఊపందుకున్నాయి. అయితే తమ సమావేశం వివరాలపై ఆయన క్లుప్తంగా మాట్లాడుతూ, ప్రజలకు సంబంధించిన అంశాలపై తాము మాట్లాడామని చెప్పారు. సమావేశంలో రాజకీయాల ప్రస్తావనపై అడిగనప్పుడు ఆయన సూటిగా సమాధానం ఇవ్వలేదు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సారథ్యంలోని డీఎంకేను ఓడించడమే తమ ఏకైక లక్ష్యమని, ఇందుకోసం ఎలాంటి పొత్తులు పెట్టుకోవాల్సి వచ్చినా దానిపై 2026 ఎన్నికల ముందు ఒక నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.



**బీజేపీతో పొత్తు పెట్టుకునేది లేదని గతంలో చేసిన వ్యాఖ్యలపై అడిగినప్పుడు, భాగస్వామ్య పార్టీలను మార్చని పార్టీ ఒక్కటైనా ఉందా అని ఆయన ప్రశ్నించారు. తమకు పార్టీ సిద్ధాంతం, పొత్తులు అనేవి రెండు వేర్వేరు అంశాలనీ, సిద్ధాంతాలు ఎప్పుడూ స్థిరంగా ఉంటాయని, పొత్తులనేవి రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా ఉంటాయని అన్నారు. ఎన్నికలు దగ్గర పడినప్పుడు పొత్తులపై ఒక నిర్ణయం తప్పనిసరిగా తీసుకుంటామని, మీడియాకు కూడా తెలియజేస్తామని నవ్వుతూ చెప్పారు. అయితే ఒకటి మాత్రం స్పష్టమని, డీఎంకేనే తమ ప్రత్యర్థి అని, 2026 ఎన్నికల్లో డీఎంకేను ఓడించడమే తమ ఏకైక లక్ష్యమని పళని స్వామి చెప్పారు.**




## ఫోన్‌పే, గూగుల్ పే యూజర్లకు షాక్..

# యూపీఐ సేవల్లో అంతరాయం

యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ సేవలకు దేశవ్యాప్తంగా అంతరాయం ఏర్పడింది. చాలామంది వినియోగదారులు లావాదేవీలను చేయలేకపోయినట్లు వెల్లడించారు. బుధవారం రాత్రి 7:50 గంటలకు 2,750 యూపీఐ లావాదేవీలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి. గూగుల్‌పే వినియోగదారుల నుంచి 296 ఫిర్యాదులు వచ్చాయి. యూపీఐ సేవలు డౌన్ అవ్వడంతో.. దేశవ్యాప్తంగా వినియోగదారులు లావాదేవీలు చేయడంలో అంతరాయాన్ని ఎదుర్కొంటున్నారు. వినియోగదారులు సోషల్ మీడియా వేదికగా.. వారు ఎదుర్కొన్న సమస్యలను పోస్ట్ చేస్తున్నారు. అయితే ఈ సమస్య కారణం ఏమిటనేది తెలియాల్సి ఉంది.



## భారత్ కోసం రెండు జపనీస్

# బ్రాండ్ కార్లు

**ఇండియన్ మార్కెట్లో అత్యంత ప్రజాదరణ పొందిన కంపెనీలలో ఒకటైన 'నిస్సాన్' మరో రెండు కార్లను లాంచ్ చేయడానికి సన్నద్ధమవుతోంది. ఇందులో ఒకటి 5 సీటర్, మరొకటి 7 సీటర్. వీటిని కంపెనీ 2026లో దేశీయ విఫణిలోకి ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది.**

జపాన్‌లోని యోకోహామాలో ఇటీవల ముగిసిన గ్లోబల్ ప్రొడక్ట్ షోకేస్ ఈవెంట్‌లో నిస్సాన్ కంపెనీ భారతదేశం కోసం తీసుకురానున్న రెండు కొత్త ఉత్పత్తులను ప్రదర్శించింది. దీన్ని బట్టి చూస్తే.. ఇండియన్ మార్కెట్లో తన హవా కొనసాగించడానికి సంస్థ తయారవుతున్నట్లు తెలుస్తోంది.

నిస్సాన్ కంపెనీ ఈ రెండు కార్లను భారతదేశంలో అధికారికంగా 2026లో ప్రారంభించనుంది. ఇవి రెండూ.. ఇప్పుడున్న బ్రాండ్ మోడల్స్ కంటే భిన్నంగా.. ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇచ్చే విధంగా ఉంటాయని తెలుస్తోంది. కాగా ఈ కార్లకు సంబంధించిన చాలా వివరాలు వెల్లడికావాల్సి ఉంది. అయితే వీటిని కంపెనీ ప్రత్యేకించి ఇండియన్ మార్కెట్ కోసం డిజైన్ చేస్తోంది, కాబట్టి ఇవి వాహన వినియోగదారులకు చాలా అనుకూలంగా ఉంటాయని తెలుస్తోంది.

ప్రస్తుతం ఇండియన్ మార్కెట్లో నిస్సాన్ కేవలం ఒక కారును (మాగ్నైట్) మాత్రమే విక్రయిస్తోంది. ఇది ప్రారంభం నుంచి 1.70 లక్షల కంటే ఎక్కువ సేల్స్ పొందింది. దీని ధర రూ. 6.14 లక్షల నుంచి రూ. 11.92 లక్షల (ఎక్స్ షోరూమ్) మధ్య ఉంది. డిజైన్, ఫీచర్స్ అద్భుతంగా ఉన్నాయి. పనితీరు కూడా ఉత్తమంగా ఉంటుంది.

HDFC BANK

## హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు

# ఆర్‌బీఐ ₹75 లక్షల జరిమానా

**హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు ఆర్‌బీఐ భారీ జరిమానా విధించింది.**

**ఈ కబురు దిల్లీ:** ప్రముఖ ప్రైవేటురంగ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) భారీ జరిమానా విధించింది. కేవైసీ నిబంధనలను పాటించనందుకు గానూ రూ.75 లక్షలు జరిమానా విధించినట్లు బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. కేవైసీకి సంబంధించి 2016లో ఆర్‌బీఐ జారీ చేసిన మార్గదర్శకాలను పాటించలేదన్న కారణంతో ఈ పెనాల్టీ విధించినట్లు ఆర్‌బీఐ పేర్కొంది. 2024 నవంబర్‌లో చివరిసారిగా కేవైసీ నిబంధనలను సవరించారు. 2023 మార్చిలో బ్యాంకులో నిర్వహించిన పరిశీలనలో ఈ లోపాలు గుర్తించినట్లు ఆర్‌బీఐ తెలిపింది. ఈ మేరకు బ్యాంక్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయగా.. అందుకు బ్యాంక్ ఇచ్చిన వివరణతో సంతృప్తి చెందకపోవడంతో ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. కస్టమర్లను రిస్క్‌ల వారీగా విభజించకపోవడం, యునిక్ కస్టమర్ కోడ్ జారీ చేయాల్సిన చోట ఒకే ఐడెంటిఫికేషన్ కోడ్‌ను పలువురికి కేటాయించడం వంటి లోపాలను తాము గుర్తించినట్లు ఆర్‌బీఐ తెలిపింది. ఇది రెగ్యులేటరీ సంస్థ ఆదేశాలు పాటించనందుకు వేసిన పెనాల్టీ మాత్రమేనని, కస్టమర్లకు లావాదేవీలకు దీంతో సంబంధం లేదని పేర్కొంది.

## రోల్స్ రాయిస్..

# 2,500 మందికి లేఆఫ్స్

**ప్రముఖ బ్రిటిష్ లగ్జరీ కారు, ఏరో ఇంజిన్ తయారీ సంస్థ రోల్స్ రాయిస్ గడిచిన ఏడాది కాలంలో 2,500 మందికి లేఆఫ్స్ ప్రకటించింది. వీరిలో ఎక్కువ మంది మేనేజర్ స్థాయి ఉద్యోగులేనని ఫార్చ్యూన్ రిపోర్ట్ తెలిపింది. కంపెనీ సీఈఓగా టుఫాన్ ఎర్గిన్‌బిలిక్ బాధ్యతలు చేపట్టిన సంవత్సరం కాలంలో విభిన్న పరిణామాలు చోటుచేసుకున్నాయి. అందులో భాగంగా కొందరు ఉద్యోగులకు లేఆఫ్స్ ప్రకటించడంతోపాటు సంస్థ షేరు ధర 500 శాతం ఎగబాకి రికార్డు నెలకొల్పింది.**

రోల్స్ రాయిస్ సీఈఓగా టుఫాన్ ఎర్గిన్‌బిలిక్ 2023 చివర్లో బాధ్యతలు చేపట్టారు. ఆ సమయంలో నిర్దిష్ట గడువులోపు కంపెనీ ఆదాయాన్ని గణనీయంగా పెంచాలని నిర్ణయించున్నారు. సంస్థ రెవెన్యూ పెంచడంలో భాగంగా 2,500 మంది ఉద్యోగులకు లేఆఫ్స్ ప్రకటించారు. దాంతోపాటు కొన్ని విధానపరమైన నిర్ణయాలతో సంస్థ ఆదాయాన్ని ముందుగా నిర్ణయించుకున్న గడువులోపే మార్కెట్ విలువకు 70 బిలియన్ డాలర్లకు పైగా జోడించారు. ఇది పెట్టుబడిదారులను ఆకర్షించి స్టాక్ ధర ఏకంగా ఏడాదిలో 500 శాతం ఎగబాకేలా చేసింది.

ఈమేరకు ఎర్గిన్‌బిలిక్ ఫైనాన్షియల్ టైమ్స్‌తో మాట్లాడుతూ.. 'రోల్స్ రాయిస్ సంస్థ ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఉద్యోగులకు స్పష్టంగా తెలియజేశాం. దాంతో కంపెనీలో 42,000 మంది ఉద్యోగులు అప్రమత్తం అయ్యారు. ఇది పనిపై మరింత ఫోకస్ పెట్టేందుకు కారణమైంది. కరోనా సమయంలో విమాన ప్రయాణాలు తగ్గడంతో కంపెనీ కాంట్రాక్టులు తగ్గిపోయాయి. తిరిగి మార్కెట్‌లో క్రమంగా పుంజుకున్నాం. రోల్స్ రాయిస్ ఒక బర్నింగ్ ప్లాట్‌ఫామ్. ఉద్యోగుల మెరుగైన ఆలోచనలను అమలు చేసేందుకు 500 మందికి ప్రత్యేకంగా వర్క్‌షాప్‌లను నిర్వహించాం' అని తెలిపారు.





## భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

స్వల్ప లాభాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ ముగిసే సమయానికి భారీ నష్టాలను చవిచూశాయి. సెన్సెక్స్ 757.55 పాయింట్లు లేదా 0.97 శాతం నష్టంతో 77,259.64 వద్ద, నిఫ్టీ 204.10 పాయింట్లు లేదా 0.86 శాతం నష్టంతో 23,464.55 వద్ద నిలిచాయి.

టూరిజం ఫైనాన్స్ కార్ప్ ఆఫ్ ఇండియా, కాప్రి గ్లోబల్ క్యాపిటల్, జెనస్ పేపర్ & బోర్డ్, పిల్ ఇటాలికా లైఫ్‌స్టైల్, SMS లైఫ్ సైన్సెస్ ఇండియా వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో ఉన్నాయి. NDL వెంచర్స్, సలాసర్ టెక్నో ఇంజనీరింగ్, షేర్, లోటస్ ఐ కేర్ హాస్పిటల్ వంటి కంపెనీలు నష్టాలను చవి చూశాయి.

# ఐపీవోకు ఇందిరా ఐవీఎఫ్ నో

**ప్రాస్పెక్టస్ వెనక్కి తీసుకున్న కంపెనీ**




**న్యూఢిల్లీ:** ఫెర్టిలిటీ క్లినిక్ చైన్ ఇందిరా ఐవీఎఫ్ హాస్పిటల్ పబ్లిక్ ఇష్యూ ప్రణాళికలను పక్కన పెట్టింది. క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి ప్రాస్పెక్టస్‌ను వెనక్కి తీసుకుంది. కంపెనీ ఇంతక్రితం గోప్యతా మార్గంలో ఐపీవో చేపట్టేందుకు సెబీకి ముందస్తు దరఖాస్తు చేసింది. రహస్య ఫైలింగ్ చేసిన కంపెనీ సంబంధిత వివరాలను గోప్యంగా ఉంచేందుకు వీలుంటుంది. అంతేకాకుండా కచ్చితంగా పబ్లిక్ ఇష్యూ చేపట్టాలన్న నిబంధనలేమీ లేవు. ఫిబ్రవరి 13న సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను సమర్పించిన కంపెనీ కారణాలు వెల్లడించకుండా ఈ నెల 19న ఉపసంహరించుకుంది.

ఇంతక్రితం 2023లో హోటళ్ల అగ్రిగేటర్ ఓయో సెబీకి రహస్య ఫైలింగ్ చేసినప్పటికీ ఐపీవో చేపట్టలేదు. అయితే 2024లో రిటైల్ దిగ్గజం విశాల్ మెగామార్ట్, ఫుడ్ డెలివరీ దిగ్గజం స్విగ్గీ ఐపీవోలు చేపట్టి స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యాయి. ఈ బాటలో గత వారం ఫిజిక్స్‌వాలా సైతం కాన్ఫిడెన్షియల్ రూట్‌లో సెబీకి పత్రాలు దాఖలు చేసింది. కాగా.. 2022 డిసెంబర్‌లో టాటా ప్లే(గతంలో టాటా స్కై) దేశీయంగా తొలిసారి రహస్య ఫైలింగ్ రూట్‌లో సెబీకి దరఖాస్తు చేసింది. 2023 ఏప్రిల్‌లో అనుమతి పొందినప్పటికీ ఐపీవోకు రాకపోవడం గమనార్హం!

### అగ్రివేర్‌హౌసింగ్‌కు చెక్

అగ్రివేర్‌హౌసింగ్ అండ్ కొలేటరల్ మేనేజ్‌మెంట్ సంస్థ 2024 డిసెంబర్‌లో దాఖలు చేసిన ప్రాస్పెక్టస్‌ను సెబీ తాజాగా వెనక్కి పంపింది. టెక్నాలజీ ఆధారిత అగ్రికల్చర్ సర్వీసులందించే కంపెనీ ఐపీవోలో భాగంగా రూ. 450 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయాలని భావించింది. వీటికి జతగా మరో 2.69 కోట్ల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచాలని ప్రణాళికలు వేసింది. వాటాదారుల్లో టెమాసెక్ 1.19 కోట్ల షేర్లు ఆఫర్ చేయనుంది. సాధారణ ఫైలింగ్ చేస్తే సెబీ అనుమతి పొందిన 12 నెలల్లోగా ఐపీవో చేపట్టవలసి ఉంటుంది.

## 2.50 లక్షల ఉత్పత్తి సామర్థ్యంతో

# మారుతీ సుజుకీ కొత్త ప్లాంట్

**'మారుతి సుజుకీ' హర్యానాలోని ఖర్ఖోడాలో తన మూడవ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికై రూ.7,410 కోట్ల పెట్టుబడికి కంపెనీ బోర్డు ఆమోదం తెలిపినట్లు ఈ రోజు ప్రకటించింది.**

**ఈ కబురు :** హర్యానాలోని ఖర్ఖోడాలో సంవత్సరానికి 2.50 లక్షల వాహనాల ఉత్పత్తి సామర్థ్యంతో మూడవ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి రూ.7,410 కోట్ల పెట్టుబడిని ఆమోదించినట్లు మారుతి సుజుకీ ఇండియా ఈ రోజు(బుధవారం) తెలిపింది. ఖర్ఖోడాలో ప్రస్తుత సామర్థ్యం సంవత్సరానికి 2.50 లక్షల యూనిట్లు. సంవత్సరానికి 2.50 లక్షల యూనిట్ల సామర్థ్యంతో మరో ప్లాంట్ ఇప్పటికే నిర్మాణంలో ఉందని మారుతి సుజుకీ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. బుధవారం జరిగిన తన సమావేశంలో ఖర్ఖోడాలో సంవత్సరానికి 2.50 లక్షల వాహనాల సామర్థ్యంతో మూడవ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి బోర్డు ఆమోదం తెలిపింది. ఖర్ఖోడా సామర్థ్యం 2029 నాటికి సంవత్సరానికి మొత్తం 7.50 లక్షల యూనిట్లకు పెరగనుందని కంపెనీ వర్గాలు తెలిపాయి. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా మూడవ ప్లాంట్ నిర్మాణం చేయనున్నామని, అంతర్గత సముపార్జనల ద్వారా పెట్టుబడికి నిధులు సమకూర్చుకుంటామని కంపెనీ తెలిపింది.






**2024లో, మారుతి సుజుకీ చరిత్రలో తొలిసారిగా ఒక క్యాలెండర్ సంవత్సరంలో 20 లక్షలకు పైగా వాహనాలను ఉత్పత్తి చేయడం ద్వారా ఒక ముఖ్యమైన మైలురాయిని సాధించింది. సుజుకీ మోటార్ కార్పొరేషన్‌కు సంబంధించిన ప్రపంచ ఆటోమొబైల్ తయారీ సౌకర్యాలలో ఈ మైలురాయిని చేరుకున్న మొదటి సంస్థగా మారుతి సుజుకీ నిలిచిందని, 2024 డిసెంబర్‌లో కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. 2024లో ఉత్పత్తి అయిన 20 లక్షల వాహనాలలో దాదాపు 60% హర్యానాలోని ప్లాంట్లలో తయారయితే, మిగిలిన 40% గుజరాత్ ప్లాంట్ నుంచి వచ్చాయని కంపెనీ తెలిపింది. కంపెనీ 10 లక్షల యూనిట్ల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో కొత్త గ్రీన్‌ఫీల్డ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని కూడా యోచిస్తోంది. ప్రాజెక్ట్ కోసం తగిన స్థానాన్ని ఎంచుకునే ప్రక్రియలో ఉంది.**

# ఎక్కడికెళ్లినా గర్వంగా ఇక్కడికే వస్తా!: శ్రీలీల

**“ఒక సినిమాతో ప్రేక్షకులకు వినోదం పంచితే, మరో సినిమాతో సందేశం ఇవ్వాలి. ఇలా నా సినిమాలను బ్యాలెన్స్ చేసుకోవాలనుకుంటున్నాను. తెలుగు అమ్మాయిగా, హీరోయిన్‌గా నాపై ఆ బాధ్యత ఉంటుంది” అని హీరోయిన్ శ్రీలీల అన్నారు. నితిన్, శ్రీలీల జంటగా నటించిన తాజా చిత్రం ‘రాబిన్‌హుడ్’. ఆస్ట్రేలియన్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ ఓ అతిథి పాత్రలో నటించారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 28న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రకథానాయిక శ్రీలీల పంచుకున్న విశేషాలు.**

- ‘రాబిన్‌హుడ్’ సినిమాలో ఫారిన్ నుంచి ఇండియాకు వచ్చిన నీరా వాసుదేవ్ అనే అమ్మాయి పాత్రలో కనిపిస్తాను. తన ప్రపంచంలో తను ఉంటుంది. ఈ ప్రపంచం అంతా తన చుట్టూనే ఉంటుందని అనుకుంటుంది. నా కెరీర్‌లో నీరా వాసుదేవ్ లాంటి ఫన్ రోల్‌ను ఇప్పటివరకూ చేయలేదు. నితిన్‌గారితో వర్క్ చేయడం ఇది రెండోసారి (గతంలో ‘ఎక్స్‌ట్రా’ మూవీలో కలిసి నటించారు). చాలా కంఫర్ట్‌గా ఉంటుంది. ఓ ఫ్యామిలీ మెంబర్‌లా ఉంటారు. ఈ సినిమాతో మాకు హిట్ పెయిర్‌గా పేరు వస్తుంది. ‘రాబిన్‌హుడ్’ సినిమా విజయంపై పూర్తి నమ్మకంతో ఉన్నాం.
- నీరా వాసుదేవ్ పాత్రకు రష్మికా మందన్నాను అనుకున్నారు. రష్మికకు కూడా నచ్చిన పాత్ర ఇది. కానీ కాల్షీట్స్ విషయంలో సమస్యలు రావడం వల్ల రష్మిక తప్పుకున్నారు. ఆ సమయంలో వెంకీగారు నాకు ఫోన్ చేసి, ఈ రోల్ గురించి చెప్పారు. నాకు నచ్చి ఓకే అన్నాను. ఇటీవల ‘పుష్ప: ది రూల్’ షూటింగ్‌లో మేం కలుసుకున్నప్పుడు రష్మిక నాకు ఆల్ ది బెస్ట్ చెప్పారు. నేను మైత్రీ ఫ్యామిలీలో ఉన్నానని గర్వంగా చెప్పగలను. మన ఫ్యామిలీతో సినిమాలు చేస్తే ఎలా ఉంటుందో, వారితో మూవీ చేస్తే అలా ఉంటుంది.
- ‘పుష్ప ది రూల్’ సినిమాలో ‘కిస్సిక్’ స్పెషల్ సాంగ్ చేశాను. ఈ సాంగ్ సక్సెస్ తర్వాత ఆ తరహా స్పెషల్ సాంగ్స్ చేసేందుకు నాకు కొన్ని అవకాశాలు వచ్చాయి. కానీ ‘పుష్ప: ది రూల్’ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపుపొందిన భారతీయ సినిమా. సో… ఆ సినిమాలో స్పెషల్ సాంగ్ చేశాను. అయితే ఇకపై ఇలాంటి పెద్ద సినిమాల్లో సాంగ్స్‌కి బదులుగా మంచి రోల్స్ చేయాలనుకుంటున్నాను.
- 2023లో నావి ఐదారు సినిమాలు రిలీజ్ అయ్యాయి. దాంతో త్రీ షిఫ్ట్స్ కూడా వర్క్ చేశాను. అయితే గత ఏడాది హీరోయిన్‌గా ఒకే ఒక్క సినిమా (‘గుంటూరు కారం) లో కనిపించాను. నా ఫైనల్ ఇయర్ మెడికల్ ఎగ్జామ్స్ వల్ల ఎక్కువ సినిమాలు చేయలేదు. ఈ గ్యాప్‌లో ఎన్నో మంచి రోల్స్, మంచి చిత్రాలు వదులుకున్నాను.
- ప్రస్తుతం రవితేజగారితో ‘మాస్ జాతర’, శివ కార్తికేయన్‌గారితో ‘పరాశక్తి’, కన్నడ-తెలుగు భాషల్లో ‘జూనియర్’ సినిమా చేస్తున్నాను. ‘రాబిన్ హుడ్’లో కేతికా శర్మ చేసిన స్పెషల్ సాంగ్ ‘అదిదా సర్‌ప్రైజ్’లోని కొన్ని డ్యాన్స్ మూమెంట్స్‌కి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. మీరు అద్భుతమైన డ్యాన్సర్. ఆ తరహా డ్యాన్స్ మూవ్స్, కొరియోగ్రఫీ గురించి ఓ హీరోయిన్‌గా ఏం చెప్తారు?

**“ఒక అమ్మాయి దృష్టి కోణంలో చెప్పాలంటే… మనం కంఫర్టబుల్‌గా ఉన్నామా? లేదా? అనేది ముఖ్యం. స్టెప్స్ అనేవి చేసేవారి కంఫర్ట్ లెవల్స్‌పై ఆధారపడి ఉంటాయి. కంఫర్ట్ జోన్ అనేది పర్సన్ టు పర్సన్ మారుతుంది. అయితే… అమ్మాయి ఇబ్బంది పడలేదు అన్నప్పుడు ఆలోచించాల్సిన అవసరం లేదు. హీరోయిన్‌గా నేను ఎన్నో సాంగ్స్ చేశాను. శేఖర్ మాస్టర్‌తో కూడా చేశాను.**

అందరం హ్యాపీ’’ అంటున్న శ్రీలీలతో బాలకృష్ణ ‘డాకు మహారాజ్’ సినిమాలోని డ్యాన్స్ మూవ్స్, అలాగే వేరే సినిమాల్లోని ఈ తరహా డ్యాన్స్ మూవ్స్‌పై మహిళా కమిషన్ కూడా అభ్యంతరం వ్యక్తం చేసింది. మీరేం అంటారు? అన్న ప్రశ్నకు శ్రీలీల బదులిస్తూ… ‘‘మహిళా కమిషన్‌కి మంచి స్థాయి ఉంది. ఏది సరైనదో వారికి తెలుసు. పాత సినిమాల పట్ల కూడా వారికి నాలెడ్జ్ ఉంది. అన్నీ ఆలోచించి నిర్ణయం తీసుకుంటారనుకుంటున్నాను’’ అన్నారు.

**హిందీ చిత్ర పరిశ్రమలో బిజీ అవుతున్నారు… అక్కడికే వెళ్లిపోతారని కొందరు అంటున్నారు..**
అన్ని భాషల్లో సినిమాలు చేయాలనుకుంటున్నాను. కానీ శ్రీలీల అంటే ఎవరు? తెలుగింటి అమ్మాయి. తెలుగుచిత్ర పరిశ్రమ నాకు ఇల్లులాంటిది. ఒకవేళ బయటకు వెళ్లినా గర్వంగా ఇక్కడికే (తెలుగు) తిరిగి వస్తాను. మన పిల్లలు చదువుకోవడానికి మరొక చోటుకు వెళతారు. కానీ మళ్లీ మన ఇంటికే వస్తారు కదా! సరిహద్దులు మారినంత మాత్రాన గాలి మారదు. నేను అన్ని భాషలనూ బ్యాలెన్స్ చేస్తూ, సినిమాలు చేయాలనుకుంటున్నాను.





# జపాన్ లో బర్త్ డే సెలబ్రేషన్స్.. తారక్ పోస్ట్ చూశారా?

జూ.ఎన్టీఆర్ ప్రస్తుతం జపాన్ లో ఉన్నాడు. గతేడాది మన దగ్గర రిలీజైన దేవర .. ఈ 28న జపాన్ థియేటర్లలో రిలీజ్ కానుంది. ఇదివరకే ప్రీమియర్స్ పడగా.. వాటికి తారక్ తోపాటు దర్శకుడు కొరటాల శివ కూడా హాజరవడం విశేషం.

సతీసమేతంగా జపాన్ వెళ్లిన ఎన్టీఆర్.. తన భార్య ప్రణతి పుట్టినరోజు వేడుకల్ని మంగళవారం రాత్రి సెలబ్రేట్ చేసుకున్నాడు. ఇందుకు సంబంధించిన రెండు ఫొటోలని షేర్ చేసుకోవడంతో పాటు క్యూట్ క్యాప్షన్ కూడా పెట్టాడు.

'అమ్మలు.. హ్యాపీ బర్త్ డే' అని తారక్ తన ఇన్ స్టాలో రాసుకొచ్చాడు. దీనికి నెటిజన్ల లైకులు కొట్టేస్తున్నారు. 2011లో తారక్‌ప్రణతికి పెళ్లయింది. వీళ్లకు ఇద్దరు కొడుకులు ఉన్నారు.

సినిమాల విషయానికొస్తే జపాన్ నుంచి వచ్చిన వెంటనే ఎన్‌టీఆర్.. ప్రశాంత్ నీల్ తీస్తున్న సినిమా షూటింగ్ లో పాల్గొంటాడు. తర్వాత షెడ్యూల్ బెంగళూరులో ఉన్నట్లు తెలుస్తోంది.



# సడన్‌గా సైడ్ చేశారు.. నా ప్లేస్‌లో కుక్కతో షూటింగ్ చేశారు

సక్సెస్ అంత ఈజీగా రాదు. ఎన్నో ఆటంకాలు, అవమానాలు దాటుకుని వచ్చాకే విజయ ఫలాల్ని అందుకోగలరు. తెలుగు హీరోయిన్ శోభిత ధూళిపాళ విషయంలోనూ ఇదే జరిగింది. టాలీవుడ్ లో కంటే బాలీవుడ్ లోనే ఎక్కువ గుర్తింపు తెచ్చుకుందీ బ్యూటీ. అయితే హీరోయిన్‌గా నిలదొక్కుకోవడానికి ముందు చేదు అనుభవాల్ని ఎదుర్కొందట. గతంలో తనే ఈ విషయాన్ని వెల్లడించింది.

**రాత్రి 11.30 గంటలకు ఫోన్**
శోభిత మాట్లాడుతూ.. ఒక బ్రాండ్ వాళ్లు రాత్రి 11.30 గంటలకు ఫోన్ చేసి ఆడిషన్‌కు పిలిచారు. నాకు కాస్త విచిత్రంగా అనిపించింది. సర్లే అని వెళ్లాను. ఆడిషన్ పూర్తయింది. నన్ను సెలక్ట్ చేశామని తెలిపారు. యాడ్ షూటింగ్ కోసం గోవాకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. అదేదో థాయ్‌లాండ్, ఆస్ట్రేలియా కాకపోయినా గోవా అనగానే నేను ఎగ్జయిట్ అయ్యాను. గోవా వెళ్లాక మొదటిరోజు షూటింగ్ బానే జరిగింది. కానీ కెమెరాలో ఏదో ప్రాబ్లమ్ ఉందని చెప్పి మిగిలింది తర్వాత షూట్ చేద్దామన్నారు.

**సెట్టవట్లే అని తీసేశారు**
తర్వాతి రోజు నేను సెట్‌కు వెళ్లగానే.. ఈ అమ్మాయి మన బ్రాండ్ ఇమేజ్‌కు సరిపోదు అని మాట్లాడుతున్నారు. కారణమేంటో తెలుసా? నేను కాన్ఫిడెంట్‌గా కనిపిస్తున్నానని వద్దన్నారు. అంత ఆత్మస్థైరంతో కనిపించే అమ్మాయి ఈ బ్రాండ్‌కు సెట్టవదని పక్కన పెట్టేశారు. నా ప్లేస్‌లో ఓ శునకాన్ని తీసుకున్నారు. కానీ ఒకరోజు పనిచేసినందుకు నాకు డబ్బులిచ్చారు అని చెప్పుకొచ్చింది. అది విన్న యాంకర్.. శోభితకు బదులు శునకాన్ని బ్రాండ్ ప్రమోషన్ కోసం వాడుకోవడమేంటని నోరెళ్లబెట్టారు.

**సినిమా..**
రామన్ రాఘవన్ 2.0 సినిమాతో వెండితెరపై తన ప్రయాణం ఆరంభించింది శోభిత. గూఢచారితో తెలుగులో ఎంట్రీ ఇచ్చింది. మేజర్, పొన్నియన్ సెల్వన్ చిత్రాల్లో మెరిసింది. మంకీ మ్యాన్ అనే హాలీవుడ్‌లో మూవీలోనూ యాక్ట్ చేసింది. కల్కి 2898 ఏడీ చిత్రంలో దీపికా పదుకొణెకు తెలుగు డబ్బింగ్ చెప్పింది. శోభిత 2024 డిసెంబర్ 4న హీరో అక్కినేని నాగచైతన్యను పెళ్లాడింది.



# ‘ఎంపురాన్’కి వెళ్తున్నారా..? అయితే ‘లూసిఫర్’ కథ తెలుసుకోవాల్సిందే?


‘లూసిఫర్’.. 2019లో రిలీజైన ఈ మలయాళ మూవీ ఎంత ఘనవిజయం సాధించిందో అందరికి తెలిసిందే. రూ.30 కోట్లతో తీస్తే, రూ.125 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి.. మలయాళంలో అత్యధిక వసూళ్లను సాధించిన ఎనిమిదో చిత్రంగా నిలిచింది. హీరో మోహన్‌లాల్‌కి, దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమార్‌కి కెరీర్‌లోనే బెస్ట్ చిత్రంగా ‘లూసిఫర్’ నిలిచిపోయింది. ఇప్పుడు ఈ చిత్రానికి కొనసాగింపుగా ‘L2: ఎంపురాన్’ వస్తోంది. ఇప్పటికే అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం రేపు (మార్చి 27)న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ నేపథ్యంలో లూసిఫర్ కథేంటి? ఎంపురాన్ లో ఏం చెప్పబోతున్నారు? అసలు ఎంపురాన్ అంటే ఏంటి? తదితర ఆసక్తికర విషయాలను తెలుసుకుందాం.

**లూసిఫర్ కథేంటి?**
ముఖ్యమంత్రి పి.కె రామదాసు అలియాస్ పీకేఆర్(సచిన్ ఖేద్కర్) అకాల మరణంతో ఐయూఎఫ్ (ఇండియన్ యూనియన్ ఫ్రంట్) పెద్దల కన్ను సీఎం సీటుపై పడుతుంది. తదుపరి సీఎం కావాలని అతని అల్లుడు బిమల్ నాయుడు అలియాస్ బాబీ(వివేక్ ఒబెరాయ్) భావిస్తాడు. అందుకోసం పార్టీలోని కొంతమంది అవినీతిపరులతో చేతులు కలుపుతాడు. అయితే పీకేఆర్ సన్నిహితుడు, పార్టీ కీలక నేత స్టీఫెన్ గట్టుపల్లి (మోహన్‌లాల్) మాత్రం బాబీ ఆగడాలకు అడ్డుకట్ట వేస్తూ సీఎం కాకుండా చేస్తాడు. దీంతో స్టీఫెన్‌ని హత్య చేయించేందుకు బాబీ కుట్ర చేస్తాడు. ఆ కుట్రను బాబీ ఎలా తిప్పికొట్టాడు? బాబీ తీసుకురావాలనుకున్న డ్రగ్స్‌ను రాష్ట్రానికి రాకుండా ఎలా అడ్డుకున్నాడు? పీకేఆర్ తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి పదవి ఎవరిని వరించింది? అసలు స్టీఫెన్ గతం ఏంటి? అన్నదే లూసీఫర్ కథ.

స్టోరీ పరంగా చూస్తే ఇది రొటీన్ పొలిటికల్ డ్రామా. కానీ దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమార్ ఒక్కో సీన్‌ని తీర్చిదిద్దిన విధానం, మోహన్‌లాల్ సెటిల్డ్ యాక్టింగ్ సినిమా విజయంలో కీలక పాత్ర పోషించాయి. వివేక్ ఒబెరాయ్, మోహన్ లాల్ పాత్రల మధ్య నువ్వా నేనా అన్నట్లు సన్నివేశాలు సాగుతాయి. మధ్య మధ్యలో వచ్చే ట్విస్టులు థ్రిల్లింగ్‌గా అనిపిస్తాయి. క్లైమాక్స్‌లో స్టీఫెన్ నేపథ్యం చెబుతూ సినిమాను ముగించారు. ఇప్పుడదే ‘ఎల్ 2: ఎంపురాన్’పై ఆసక్తిని పెంచేసింది.

**అసలు ఎంపురాన్ అంటే ఏంటి?**
లూసిఫర్ అనే టైటిల్ వినగానే అసలు ఈ పేరు ఎందుకు పెట్టారని అంతా అనుకున్నారు. కానీ సినిమా రిలీజ్ అయిన తర్వాత ఆ టైటిల్ ఎందుకు పెట్టారో తెలిసింది. క్రైస్తవంలో లూసిఫర్ అంటే దైవదూత అని అర్థం. భగవంతుని ఆజ్ఞను వ్యతిరేకించి కిందకు వచ్చి దుష్టుడిగా మారి, మానవాళి పాపాలు చేసేందుకు ప్రేరేపించేవాడినే లూసీఫర్ అంటారు. అందుకే ఈ సినిమాలో ‘దుర్మార్గులకు, మహాదుర్మార్గులకు జరిగే యుద్ధం’ అని హీరో పాత్రలో చెప్పించారు. ఇక ఇప్పుడు ఈ చిత్రానికి సీక్వెల్‌గా వచ్చిన మూవీకి ‘ఎంపురాన్’ అని టైటిల్ పెట్టారు. దీని అర్థం ఏంటంటే.. ‘రాజు కంటే ఎక్కువ.. దేవుడి కంటే తక్కువ’ అని అర్థం. హీరో పాత్రను దృష్టిలో పెట్టుకొని ఈ టైటిల్‌ని పెట్టారు. దాదాపు రూ. 180 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకులను ఏ మేరకు మెప్పిస్తుందో చూడాలి.

# వయసు 28.. 'నేషనల్ క్రష్' ఆస్తి?



అప్పుడప్పుడు కొందరు సెలబ్రిటీలకు దశ తిరిగేస్తుంటుంది. ప్రస్తుతం అలాంటి ఫేజ్ లో రష్మిక ఉంది. తెలుగు, తమిళ, హిందీ.. ఇలా భాషతో సంబంధం లేకుండా సినిమాలు చేస్తూ బ్లాక్ బస్టర్ సక్సెస్ అందుకుంటోంది. తాజాగా ఈమె ఆస్తుల గురించి ఫోర్బ్స్ నివేదిక బయటపెట్టింది.కర్ణాటకకు చెందిన రష్మిక ప్రస్తుత వయసు 28. కానీ ఆస్తి మాత్రం రూ.66 కోట్ల వరకు సంపాదించిందని ఫోర్బ్స్ చెప్పుకొచ్చింది. ఒక్కో సినిమాకు రూ.48 కోట్ల మేర రెమ్యునరేషన్ తీసుకుంటుందని పేర్కొంది. రీసెంట్ గా 'ఛావా'తో సూపర్ సక్సెస్ అందుకుంది. త్వరలో ఈమె ఆస్తి రూ.100 కోట్లకు చేరొచ్చని అంచనా.యానిమల్, పుష్ప 2, ఛావా.. ఇలా వరసగా రూ.500 కోట్ల వసూళ్ల సినిమాలు చేసిన రష్మిక మరోవైపు యాడ్స్ చేస్తూ డబ్బులు సంపాదిస్తోంది. హైదరాబాద్, ముంబై, బెంగళూరు, గోవా, కూర్గ్ లో ఈమెకు సొంత ఫ్లాట్స్ ఉన్నాయి.ఇలా రెండు చేతులా సంపాదిస్తున్న రష్మిక.. అప్పుడప్పుడు వెకేషన్స్ కి వెళ్తుంటుంది. మరోవైపు ఈమె దగ్గర బెంజ్, ఆడీ, రేంజ్ రోవర్ లాంటి ఖరీదైన కార్స్ ఉన్నాయి. ఇలా అన్నింటా రష్మిక తగ్గేదే లే అన్నట్లు దూసుకుపోతోంది.



# అదరగొట్టిన కోల్‌కతా బౌలర్లు..

## మోస్తరు స్కోరుకే పరిమితమైన రాజస్థాన్ రాయల్స్

**ఐపీఎల్ 2025లో భాగంగా నేడు రాజస్థాన్ రాయల్స్ , కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతోంది.**

**ఈ కబురు :** గువాహటి: ఐపీఎల్ 2025లో భాగంగా నేడు రాజస్థాన్ రాయల్స్ , కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతోంది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 151 పరుగులు చేసింది. మిడిల్ ఆర్డర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ (33; 28 బంతుల్లో 5 ఫోర్లు) టాప్ స్కోరర్. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (29; 24 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), సంజు శాంసన్ (13; 11 బంతుల్లో 2 ఫోర్లు) పరుగులు చేశారు. కెప్టెన్ రియాన్ పరాగ్ (25; 15 బంతుల్లో 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడినప్పటికీ క్రీజులో నిలదొక్కుకోలేకపోయాడు. నితీశ్ రాణా (8), వానిందు హసరంగ (4), శుభమ్ దూబె (9) విఫలమయ్యారు. జోఫ్రా ఆర్చర్ (16; 7 బంతుల్లో 2 సిక్స్‌లు) పోరాటంతో స్కోరు 150 దాటింది. కోల్‌కతా బౌలర్లలో వరుణ్ చక్రవర్తి, మొయిన్ అలీ, వైభవ్ అరోరా, హర్షిత్ రాణా తలో రెండు వికెట్లు పడగొట్టారు. స్పెన్సర్ జాన్సన్‌కు ఒక వికెట్ దక్కింది.

రాజస్థాన్‌కు శుభారంభమే దక్కిందని చెప్పాలి. జైస్వాల్ నిలకడగా ఆడటంతో తొలి వికెట్‌కు 33 పరుగుల భాగస్వామ్యం నమోదైంది. వైభవ్ వేసిన నాలుగో ఓవర్‌లో శాంసన్ ఔటవ్వడంతో రాజస్థాన్ తొలి వికెట్ కోల్పోయింది. స్పిన్నర్ల రాకతో రాజస్థాన్ మరింత కష్టాల్లో పడింది. వరుణ్ వరుస ఓవర్లలో పరాగ్, హసరంగను వెనక్కి పంపగా.. జైస్వాల్, నితీశ్‌ను మొయిన్ అలీ ఔట్ చేశాడు. దీంతో స్కోరు వేగం నెమ్మదించింది. వైభవ్ వేసిన 15 ఓవర్‌లో చివరి బంతికి శుభమ్ దూబె భారీ షాట్ ఆడి రస్సెల్‌కు చిక్కాడు. నిలకడగా ఆడుతున్న జురెల్‌ను, హెట్‌మయర్ (7)ను హర్షిత్ ఒకే ఓవర్‌లో పెవిలియన్‌కు పంపాడు. జాన్సన్ వేసిన ఇన్నింగ్స్ చివరి ఓవర్‌లో ఆర్చర్ క్లీన్‌బౌల్డ్ అయ్యాడు.



# గేల్ మార్క్'... ఐపీఎల్‌లో ఈ రికార్డు బద్ధలవుతుందా? 2

**ఈ ఐపీఎల్‌లో అయినా క్రిస్ గేల్ (175) రికార్డు**

**ఈ కబురు:** ఐపీఎల్ లో అత్యధిక పరుగులు చేసిన రికార్డు గురించి, అది బ్రేక్ చేసే అవకాశం సమీప భవిష్యత్తులో లేదు అంటూ మనం చదువుకున్నాం. ఐపీఎల్ చరిత్రలో బద్ధలవ్వడానికి అవకాశం తక్కువగా ఉన్న రెండో రికార్డు ఇప్పుడు చూద్దాం. ఇది యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ గురించి. 12 ఏళ్ల క్రితం అతను నెలకొల్పిన రికార్డు ఇంకా అలానే ఉంది. చూస్తుంటే ఆ రికార్డు బద్ధలవ్వడం అంత ఈజీ కాదనిపిస్తోంది. 2013లో పుణె వారియర్స్‌పై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున క్రిస్ గేల్ (175*) తుపాను ఇన్నింగ్స్ ఆడాడు. 265.15 స్ట్రయిక్ రేట్‌తో 13 ఫోర్లు, 17 సిక్సర్లు బాది భారీ సెంచరీ నమోదు చేశాడు. ఇది జరిగి 12 ఏళ్లు అవుతోంది. అప్పటి నుంచి సీజన్లు వస్తున్నాయ్, పోతున్నాయ్ కానీ ఈ రికార్డు అలానే ఉంది. అలా అని వేగంగా ఆడే బ్యాటర్లు, భారీ సిక్స్‌లు కొట్టేవాళ్లు లేరా అంటే ప్రతి జట్టులో పుష్కలంగా ఉన్నారు. కానీ గేల్ రికార్డు అలానే ఉంది.

**ఈసారి ఛాన్స్ ఉందా?**

ఐపీఎల్‌లో బ్యాటింగ్ మారింది. వికెట్లూ మారాయి. బ్యాటర్ల ఇన్నోవేటివ్ షాట్లు కూడా పెరిగాయి. అయితే వికెట్ల దగ్గర పాతుకుపోవడం తగ్గిపోయింది. వచ్చామా.. భారీ షాట్లు ఆడామా.. వెళ్లామా.. వేరొకరు వచ్చి వేగంగా ఆడారా అనే పరిస్థితి కనిపిస్తోంది. మరి ఈ ఏడాదైనా బ్యాటర్లు గేల్ మార్క్‌ను దాటుతారా? కొత్త రికార్డు సృష్టిస్తారా అనేది చూడాలి.

ఇక ఎవరికి ఆ అవకాశం ఉందా అని చూస్తే.. ఎక్కువగా ఓపెనర్లకే ఆ ఛాన్స్ ఉంటుంది. అది కూడా ఆఖరి ఓవర్ వరకు క్రీజులో ఉంటేనే. అలా ఎవరా అని చూస్తే విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, యశస్వి జైస్వాల్, సంజు శాంసన్, సునీల్ నరైన్, ఫిల్ సాల్ట్ పేర్లు కనిపిస్తాయి. అయితే సంచలనాలకు మారుపేరైన ఐపీఎల్‌లో వీళ్లే వరూ కాకుండా కొత్త కుర్రాళ్లు వచ్చి రికార్డు బద్ధలుకొట్టినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

# చెలరేగిన డికాక్..

# బోణీ కొట్టిన కోల్‌కతా

**ఐపీఎల్ 18వ సీజన్‌లో కోల్‌కతా బోణీ కొట్టింది. గువాహటి వేదికగా జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్‌పై 8 వికెట్ల తేడాతో ఆ జట్టు నెగ్గింది.**

**ఈ కబురు గువాహటి:**
ఐపీఎల్ 18లో కోల్‌కతా నైట్‌రైడర్స్ బోణీ కొట్టింది. రాజస్థాన్ రాయల్స్ తో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 8 వికెట్ల తేడాతో నెగ్గింది. 152 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కోల్‌కతా 17.3 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఓపెనర్ క్వింటన్ డికాక్ (97*: 61 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్స్‌లు) త్రుటిలో శతకం మిస్ చేసుకున్నాడు. రఘువంశీ (22*) పరుగులు చేశాడు. రాజస్థాన్ బౌలర్లలో హసరంగ ఒక వికెట్ పడగొట్టాడు. అంతకు ముందు బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 151 పరుగులు చేసింది. ధ్రువ్ జురెల్ (33) టాప్ స్కోరర్.

**కట్టడి చేసిన కోల్‌కతా బౌలర్లు..**

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 151 పరుగులు చేసింది. కోల్‌కతా బౌలర్ల ధాటికి రాజస్థాన్ బ్యాటర్లు నిలవలేకపోయారు. మిడిల్ ఆర్డర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ (33; 28 బంతుల్లో 5 ఫోర్లు) టాప్ స్కోరర్. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (29; 24 బంతుల్లో 2




ఫోర్లు, 2 సిక్స్‌లు), సంజు శాంసన్ (13; 11 బంతుల్లో 2 ఫోర్లు) పరుగులు చేశారు. కెప్టెన్ రియాన్ పరాగ్ (25; 15 బంతుల్లో 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడినప్పటికీ క్రీజులో నిలదొక్కుకోలేకపోయాడు. నితీశ్ రాణా (8), వానిందు హసరంగ (4), శుభమ్ దూబె (9) విఫలమయ్యారు. జోఫ్రా ఆర్చర్ (16; 7 బంతుల్లో 2 సిక్స్‌లు) పోరాటంతో స్కోరు 150 దాటింది. కోల్‌కతా బౌలర్లలో వరుణ్ చక్రవర్తి, మొయిన్ అలీ, వైభవ్ అరోరా, హర్షిత్ రాణా తలో రెండు వికెట్లు పడగొట్టారు. స్పెన్సర్ జాన్సన్‌కు ఒక వికెట్ దక్కింది.

రాజస్థాన్‌కు శుభారంభమే దక్కిందని చెప్పాలి. జైస్వాల్ నిలకడగా ఆడటంతో తొలి వికెట్‌కు 33 పరుగుల భాగస్వామ్యం నమోదైంది. వైభవ్ వేసిన నాలుగో ఓవర్‌లో శాంసన్ ఔటవ్వడంతో రాజస్థాన్ తొలి వికెట్ కోల్పోయింది. స్పిన్నర్ల రాకతో రాజస్థాన్ మరింత కష్టాల్లో పడింది. వరుణ్ వరుస ఓవర్లలో పరాగ్, హసరంగను వెనక్కి పంపగా.. జైస్వాల్, నితీశ్‌ను మొయిన్ అలీ ఔట్ చేశాడు. దీంతో స్కోరు వేగం నెమ్మదించింది. వైభవ్ వేసిన 15 ఓవర్‌లో చివరి బంతికి శుభమ్ దూబె భారీ షాట్ ఆడి రస్సెల్‌కు చిక్కాడు. నిలకడగా ఆడుతున్న జురెల్‌ను, హెట్‌మయర్ (7)ను హర్షిత్ ఒకే ఓవర్‌లో పెవిలియన్‌కు పంపాడు. జాన్సన్ వేసిన ఇన్నింగ్స్ చివరి ఓవర్‌లో ఆర్చర్ క్లీన్‌బౌల్డ్ అయ్యాడు.

# కోహ్లీని అడగకుండానే అతడి పర్‌ఫ్యూమ్ వాడిన స్వస్తిక్!



**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు యువ బ్యాటర్ స్వస్తిక్ చికారా తన టీమ్ సభ్యులందరినీ ఆశ్చర్యానికి గురి చేశాడు. దీనికి సంబంధించిన వీడియోను ఆర్సీబీ సోషల్ మీడియాలో షేర్ చేసింది. స్వస్తిక్ చికారా చేసిన కొంటె పనిని ఆర్సీబీ కెప్టెన్ రజత్ పటీదార్, పేసర్ యశ్‌దయాల్ బయటపెట్టారు.**

**ఈ కబురు:** రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు యువ బ్యాటర్ స్వస్తిక్ చికారా తన టీమ్ సభ్యులందరినీ ఆశ్చర్యానికి గురి చేశాడు. దీనికి సంబంధించిన వీడియోను ఆర్సీబీ సోషల్ మీడియాలో షేర్ చేసింది. స్వస్తిక్ చికారా చేసిన కొంటె పనిని ఆర్సీబీ కెప్టెన్ రజత్ పటీదార్ , పేసర్ యశ్‌దయాల్ బయటపెట్టారు. డ్రెస్సింగ్ రూమ్‌లో విరాట్ కోహ్లీ బ్యాగ్‌ను అతడి అనుమతి లేకుండానే స్వస్తిక్ చికారా తెరిచాడు. తర్వాత కోహ్లీ వాడే పర్‌ఫ్యూమ్‌ను తనపై స్ప్రే చేసుకున్నాడు. అది కూడా విరాట్ కోహ్లీ చూస్తుండగానే ఇదంతా చేశాడు.
'మేమంతా కోల్‌కతా నైట్ రైడర్స్ తో మ్యాచ్ తర్వాత డ్రెస్సింగ్ రూంలో కూర్చుని ఉన్నాం. స్వస్తిక్ చికారా.. కోహ్లీని అడగకుండానే అతడి బ్యాగ్‌ను తెరిచి, ఓ పర్‌ఫ్యూమ్ బాటిల్‌ను తీసుకున్నాడు. తర్వాత దాన్ని స్ప్రే చేసుకున్నాడు. అక్కడున్నవాళ్లమంతా నవ్వుకున్నాం' అని దయాల్ అన్నాడు. 'విరాట్ భాయ్ అక్కడే ఉన్నాడు. అతడి ముందే స్వస్తిక్ చికారా అలా చేయడాన్ని చూసి ఆశ్చర్యపోయాను' అని ఆర్సీబీ కెప్టెన్ రజత్ పటీదార్ విస్మయం వ్యక్తం చేశాడు.

'కోహ్లీ మాకు పెద్దన్నలాంటివాడు. అందుకే అతడు మంచి పర్‌ఫ్యూమ్ వాడుతున్నాడా? లేదా? అని చెక్ చేయాలి అనుకున్నా. అందుకే నేను దాన్ని జస్ట్ ఒకసారి ట్రై చేశా. అప్పుడు అక్కడే ఉన్న విరాట్... ఎలా ఉంది అని నన్ను అడిగాడు. నేను చాలా బాగుంది అని బదులిచ్చాను' అని అక్కడ జరిగిన సన్నివేశాన్ని స్వస్తిక్ చికారా వివరించాడు.



# ధోనీ మైదానంలో కాలు మోపగానే మోతమోగింది!: అశ్విన్

**ఆదివారం చెన్నై సూపర్‌కింగ్స్, ముంబయి ఇండియన్స్ మధ్య మ్యాచ్ జరిగిన విషయం తెలిసిందే. 19వ ఓవర్ తర్వాత రవీంద్ర జడేజా రనౌట్ అయ్యాడు. అప్పుడు ధోనీ మైదానంలో కాలు మోపగానే అభిమానులంతా ఆనందంతో ఈలలు, కేకలు వేశారని అశ్విన్ తెలిపాడు.**


**ఈ కబురు:** : అభిమానులకు ధోనీ మీద ఉన్న క్రేజ్ గురించి టీమ్‌ఇండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్లో వివరించారు. ఐపీఎల్ 2025లో భాగంగా ఆదివారం చెన్నై సూపర్ కింగ్స్ ,ముంబై ఇండియన్స్ మధ్య మ్యాచ్ జరిగింది. చెన్నై టీమ్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో 19వ ఓవర్ ముగిసిన తర్వాత రవీంద్ర జడేజా రనౌట్‌గా వెనుదిరిగాడు. అనంతరం మహేంద్ర సింగ్ ధోనీ మైదానంలో అడుగు పెట్టాడు. ఆ సమయంలో మైదానం అంతా మోత మోగింది. ధోనీ అభిమానులంతా ఈలలు, కేకలతో స్వాగతం పలికారు. అప్పుడు మైదానంలో షోర్‌మీటర్ ప్రకారం 122 డెసిబెల్స్ శబ్దం నమోదైంది. దాదాపు 10 సంవత్సరాల తర్వాత అశ్విన్ తిరిగి చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో భాగమయ్యాడు. అభిమానుల ఉత్సాహాన్నంతా అతడు డ్రెస్సింగ్ రూమ్ నుంచి వీక్షించాడు.
'చెన్నైలో జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో ఎప్పుడైతే ధోనీ బ్యాటింగ్ చేయడానికి వచ్చాడో... అప్పుడు ఒక్కసారిగా మైదానంలో వాతావరణం మారిపోయింది. అంత వరకు దాదాపు నిశ్శబ్దంగా ఉన్న మైదానంలో ఒక్కసారిగా మోతమోగింది. అభిమానుల కేరింతలు, కేకలతో గ్రౌండ్ అంతా దద్దరిల్లింది. ఇది ఫ్యాన్స్‌కు ధోనీ మీద ఉన్న ప్రేమకు తార్కాణం. నేను ఇంతకు ముందు ఈ సన్నివేశాలను బయట నుంచి చూసేవాణ్ని. కానీ మొదటిసారి డ్రెస్సింగ్ రూం నుంచి చూశా' అని రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్‌లో వివరించాడు.

# ప్రేక్షకుడి వేధింపులు..

# ఇగా స్వైటెక్‌కు అదనపు భద్రత

**ప్రపంచ నంబర్ 2 ఇగా స్వైటెక్ ప్రాక్టీస్‌లో ఉండగా వేధించిన ప్రేక్షకుడు అసభ్యకరంగా ఆమెను దూషించడంతో ఆమెకు అదనపు భద్రతను కేటాయిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.**

**ఈ కబురు :** పోలెండ్‌కు చెందిన ప్రపంచ నంబర్ 2 ఇగా స్వైటెక్ కు అధికారులు భద్రత పెంచారు. ఇటీవల ఆమె ప్రాక్టీస్‌లో ఉన్న సమయంలో ఓ ప్రేక్షకుడు ఇగాను అసభ్య పదజాలంతో దూషించినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. దీంతో మియామి ఓపెన్‌లో అధికారులు ఆమెకు అదనపు భద్రత కేటాయించినట్లు తెలుస్తోంది. గత నెలలో దుబాయ్ ఓపెన్ సందర్భంగా బ్రిటిష్ క్రీడాకారిణి అయిన ఎమ్మా రాడుకాను సైతం ఇటువంటి వేధింపులు ఎదుర్కొన్నారు. తాజాగా ఇగాకు కూడా ఇటువంటి అసౌకర్యం కలగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు.



**కొలుకుంటున్న తమీమ్**

"ఈ విషయాన్ని టోర్నమెంట్ నిర్వాహకుల దృష్టికి తీసుకువెళ్లాం. వారు వెంటనే మా క్రీడాకారిణికి భద్రతను పెంచడం వంటి అదనపు జాగ్రత్తలు తీసుకున్నారు. క్రీడాకారిణుల భద్రత అత్యంత ప్రాధాన్యమైన విషయం. ఇటువంటి సమస్యలను పరిష్కరించడానికి నిరంతరం కృషి చేస్తున్నాము. వారు ప్రాక్టీస్‌లో, ఆటలో ఉన్న సమయంలో ఇతరులు చేసే ఇటువంటి విద్వేషపూరిత వ్యాఖ్యలు క్రీడాకారిణులను ఆందోళనకు, అసౌకర్యానికి గురిచేస్తాయి. కాబట్టి వీటిని నివారించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నాము" అని ఇగా ప్రతినిధి పేర్కొన్నారు. కాగా ఈ విషయంపై వ్యాఖ్యానించడానికి మహిళల టెన్నిస్ అసోషియేషన్ నిరాకరించింది. ఈ ఘటనపై విచారణ చేపట్టాలని టోర్నమెంట్ నిర్వాహకులను ఆదేశించింది.